25-03-2024
సోమవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 277
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★

తర తరాల పిల్లల కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

## హోలీ, గుడ్‌ఫ్రైడేలకు ప్రభుత్వ సెలవు

ప్రజాపక్షం/హైదరాబాద్

హోలీ సందర్భంగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. హైదరాబాద్, ఇతర తెలంగాణ జిల్లాల్లోని పాఠశాలలకు హోలీ రోజున సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక మార్చి 29న క్రైస్తవుల ముఖ్య పండుగల్లో ఒకటైన గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రభుత్వం సర్కారు సాధారణ సెలవు ప్రకటించింది. మార్చి 31న ఈస్టర్ పండుగ నిర్వహించనుండటం తెలిసిందే.




జంటనగరాల పరిధిలో
## మద్యం దుకాణాలు బంద్
బార్ అండ్ రెస్టారెంట్లు కూడా మూత
హోలీ సందర్భంగా పోలీసుల ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

జంటనగరాల్లో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వైన్ షాప్‌లు మూతపడనున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు కూడా బంద్ పెట్టాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోలీ సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్‌తో పాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలో మద్యం అమ్మకాలు జరగకుండా వైన్స్ షాపులను తరువాయి 2లో

# ఢిల్లీ లిక్కర్ కేసు కక్షపూరితమేనా?



**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేసులు, అరెస్టులు సక్రమమేనా లేక ప్రతిపక్ష పార్టీలను ఇరుకున పెట్టి, వేధించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కక్షపూరిత విధానామా? అన్నది ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తెలంగాణ ఎమ్మెల్సీ, భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నాయకురాలు కల్వకుంట్ల కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. 'ది వైర్' పత్రిక ప్రచురించిన వార్తా కథనాన్ని అనుసరించి, ఈ కేసులో అప్రూవర్‌గా మారిన సంస్థ బిజెపికి రూ. 30 కోట్లు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో చెల్లించింది. లిక్కర్ కేసులో నిందితుడైన అరబిందో ఫార్మా డైరెక్టర్ పి. శరత్‌చంద్రా రెడ్డిని అదుపులోకి తీసుకున్న వెంటనే ఆ కంపెనీ 5 కోట్ల రూపాయల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసింది. ఆ మొత్తాన్ని బిజెపి వెంటనే ఎన్‌క్యాష్ చేసుకుంది. ఆ తర్వాత, 2023 జూన్‌లో శరత్‌చంద్రా రెడ్డి అప్రూవర్‌గా మారారు. అదే ఏడాది నవంబర్‌లో అరబిందో ఫార్మా బిజెపి కోసం మరో 25 కోట్ల రూపాయల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనింది. వాటిని కూడా బిజెపి రీడీమ్ చేసుకుంది. మొత్తం మీద ఆ కంపెనీ 52 కోట్ల రూపాయల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయగా, అందులవో 34.5 కోట్లు బిజెపికే తరువాయి 2లో

## జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

**న్యూఢిల్లీ:** మద్యం పాలసీలో అక్రమాలు, మనీ లాండరింగ్ కేసుల్లో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పాలన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ప్రజల సహాయార్థం తగిన చర్యలు తీసుకోవాలని నోట్ రూపంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌ను గత వారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. కస్టడీలో ఉన్న ఆయన జైలు నుంచే ఢిల్లీ వాటర్ మినిస్టర్ అతిశికి నోట్ పంపారు. తాను ఇంట్లో ఉన్నా.. జైలులో ఉన్నా.. ప్రజా సేవ కొనసాగిస్తానని, దేశానికే తన జీవితం అంకితమని కేజ్రీవాల్ ఇప్పటికే వ్యాఖ్యానించారు. జైలు నుంచి ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యలు నిర్వర్తించడానికి వీల్లేదన్న వాదన బలంగా వినిపిస్తున్నప్పటికీ, అక్కడి నుంచే అధికారులను ఉద్దేశించి ఆదేశాలు జారీ చేయడాన్ని చూస్తుంటే, ఢిల్లీకి అపద్ధర్మ ముఖ్యమంత్రి అంటూ ఎవరూ ఉండరనే విషయం స్పష్టమవుతున్నది. కాగా, ఢిల్లీలో నీటి కొరత లేకుండా చూడాలని కేజ్రీవాల్ ఆదేశాలు జారీ చేశారని వాటర్ మినిస్టర్ అతిషి చెప్పారు. ఆదివారం తరువాయి 2లో



బిఆర్ఎస్ మాజీ ఎంపి
## సంతోష్ కుమార్‌పై కేసు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపి సంతోష్‌కుమార్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో భూమి కబ్జాకు యత్నిస్తున్నారంటూ నవయుగ కంపెనీ ప్రతినిధి చింతా మాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్‌తో పాటు లింగారెడ్డి, శ్రీధర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వే తరువాయి 2లో

కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా
# 31న ఢిల్లీలో 'ఇండియా' ర్యాలీ



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఈనెల 31వ తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ప్రకటించింది. లిక్కర్ కుంభకోణంలో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, సీనియర్ నేత సంజయ్ సింగ్, బిఆర్ఎస్ నాయకురాలు, తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితసహా ఇప్పటి వరకూ 16 మందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేజ్రీవాల్‌ను కూడా అరెస్టు చేయడంతో దేశ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ఆయన అరెస్టును నిరసిస్తూ ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి 'మహా ర్యాలీ' నిర్వహించనుందని ఆప్ నాయకుడు, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షాల ఐక్యత, బలప్రదర్శనే లక్ష్యంగా ఈ నిరసన ఉండనుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగే ర్యాలీలో పాల్గొనాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తీరు, రాజ్యాంగాన్ని ప్రేమించే, గౌరవించే దేశ ప్రజలందరి హృదయాల్లో ఆగ్రహావేశాలు తెప్పించాయని రాయ్ అన్నారు. 'కేవలం కేజ్రీవాల్ గురించే కాదు. మొత్తం ప్రతిపక్షాన్ని ఒక్కొక్కటిగా తుడిచిపెట్టేస్తున్నారు. ప్రధాని మోడీ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారు. బిజెపిలో చేరాలని బెదిరిస్తున్నారు. అమ్మడానికి సిద్ధంగా లేని వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ నియంతృ పాలనకు వ్యతిరేకంగా ఈ పోరాటాన్ని బలోపేతం చేయడానికి, విస్తరించడాని ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

## రానున్న ఐదు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
హెచ్చరించిన వాతావరణ కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న ఐదు రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఆదివారం నుంచి 5 రోజల పాటు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఆదివారం నుంచి పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. దక్షిణ దిశ నుంచి కింది స్థాయి తరువాయి 2లో

## పోలీసులను వణికిస్తున్న ఫోన్‌ట్యాపింగ్
ఎస్ఐబి చీఫ్ మొదలు సిఐల వరకూ లింకులు
మాజీ డిఎస్‌పి ప్రణీత్ విచారణలో వెలుగులోకి
ఫోన్ ట్యాపింగ్‌లో వరంగల్ పోలీసులే కీలకం?
జిల్లా కేంద్రంగానే ఫోన్ ట్యాపింగ్



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగానే సాగినట్లు తెలుస్తున్నది. ఈ కేసులో కీలక పాత్ర పోషించి అరెస్టు అయిన మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావును విచారిస్తున్నా కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తున్నది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పోలీసులతో ఉన్నలింకులు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. దీంతో ఈ కేసు జిల్లా పోలీసులను నిద్ర లేకుండా చేస్తున్నది. ఏ రోజు ఎవరి పేరు బయటికి వస్తుందోనని నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార పక్షంతో అంటకాగిన పోలీసు అధికారులను ఆందోళనకు గురి చేస్తున్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రణీత్‌తో సహా మిగిలిన అధికారులంతా వరంగల్ వారు కావడంతో పాటు జిల్లాలోని పర్వతగిరిలో ఫోన్ ట్యాపింగ్ కోసం ప్రత్యేకంగా వార్ రూం ఏర్పాటు చేయడమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. ఈ వ్యవహారంలో మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును అరెస్టు చేసి విచారణ జరుపుతుండడంతో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన నిందితుడు డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావుది వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం మేడిపల్లి తరువాయి 2లో

## కేంద్ర నిధుల కోసం సుప్రీంకు కర్నాటక సిఎం



**న్యూఢిల్లీ :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నీటి కొరతతో అల్లాడుతున్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 'రాష్ట్రానికి కరువు సహాయ నిధుల పంపిణీలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వంపై ఈ పిటిషన్ దాఖలు చేశాం' అని సిద్ధరామయ్య తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై మంత్రివర్గ బృందం నివేదిక సమర్పించి ఐదు నెలలు గడుస్తున్నా కేంద్రం నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రం తీవ్ర కరువుతో అల్లాడుతోందని.. దీంతో జనజీవనం అతలాకుతలమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 236 తాలూకాల్లో 223 తాలూకాలు కరువుగా ప్రకటించారని.. వీరిలో 196 ప్రాంతాలు తీవ్ర తరువాయి 8లో



## జంపింగ్‌లకే టికెట్లా!
నికార్సైన నాయకులు లేరా..?
పార్టీల కార్యకర్తల మండిపాటు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతున్నది. మొన్నటి వరకూ ఎదుటి పార్టీలలో ఉండి విమర్శలు చేసిన నాయకులు నేడు ఎన్నికలలో టికెట్ కోసం పార్టీ మారుతుండడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటి వరకూ సొంత పార్టీలో టికెట్ వస్తుందని ఆశతో ఎదురు చూసిన వారికి దీంతో నిరాశ ఎదురవుతున్నది. ఏండ్ల తరబడి కష్టపడి పని చేసిన నాయకులను కాదని జంపింగ్ జపాంగ్‌లకు పార్టీలు టికెట్‌లు కట్టబెడుతున్నాయి. నిన్నటి వరకు శత్రువులు అనుకున్న నాయకులు నేడు పార్టీలు మారి మిత్రులుగా తరువాయి 2లో

# సరిహద్దులు దాటుతున్న 'రేషన్'
అక్రమార్కులకు వరంగా బియ్యం స్మగ్లింగ్
కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన మీదుగా సరిహద్దు మహారాష్ట్రకు అక్రమ రవాణా


(ఫైల్)

ప్రజాపక్షం/కాళేశ్వరం

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్క దారి పట్టి ఆక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం వద్ద అంతర్ రాష్ట్ర వంతెన మీదుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా నిత్యం జోరుగా సాగుతున్నది. మహారాష్ట్ర ప్రాంతాలలో బియ్యానికి డిమాండ్ ఏర్పడడంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు వరంగా మారింది. దీనితో అక్రమార్కులు తెలంగాణ ప్రాంతాల నుండి సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాలకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో రేషన్ డీలర్ల నుంచి అడ్డగోలుగా అక్రమ దందా కొనసాగించిన రేషన్ స్మగ్లర్లు ప్రభుత్వం రేషన్ షాపుల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేయడంతో ఇప్పుడు రేషన్ మాఫియా నయా రకం దందాకు తెర లేపింది. గ్రామీణ ప్రాంతాల్లో దళారి వ్యవస్థ ఏర్పాటు చేసి రేషన్ బియ్యాన్ని లబ్దిదారుల నుండి కారుచౌకగా కొనుగోలు చేసి రేషన్ అక్రమ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన ఆసరా చేసుకొని తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుండి నిత్యం వందలాది వాహనాల ద్వారా మహారాష్ట్ర ప్రాంతాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఉత్తర తరువాయి 2లో

ప్రతిపక్షాలే లక్ష్యంగా కేంద్ర ఏజెన్సీలతో
# దాడులు చేయిస్తున్న మోడీ!




సరిగ్గా పార్లమెంటుకు ఎన్నికలు రెండు నెలల ముందు నుంచి మోడీ విపక్ష పార్టీలకు చెందిన నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా దాడులు కొనసాగుతున్నారు. గత పది సంవత్సరాలలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరించిన, అమలు చేసిన ఏ ఒక్క విధానం చూసినా ప్రజా కార్మిక వ్యతిరేక చర్యలు చేపడుతూ ,హిందూ మతోన్మాద విధానాలను ప్రోత్సహిస్తుండడం ప్రజాస్వామ్య విధానాలకు తిలోదకాలిస్తూ .. ప్రజా వ్యతిరేకత మూట కట్టుకుంటున్నారు.. ముచ్చటగా మూడోసారి ఎలాగైనా మళ్లీ అధికారంలోనికి రావాలని..
ఈసారి 400 పైగా సీట్లను సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కేంద్ర ఏజెన్సీలతో వివక్షాలపై దాడులను ముమ్మరం చేయిస్తున్న పరిస్థితులు చూస్తున్నాం.

జనవరి 31న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ను భూ కుంభకోణం కేసులో ఈడి అరెస్టు చేయగా, ఆ వరుసలో రెండవ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను లిక్కర్ స్కామ్ లో మార్చి 21 న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇప్పటికే ఈ కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను పలుమార్లు విచారించిన సిబిఐ..2023 ఫిబ్రవరి 26న అరెస్ట్ చేసింది. ఇప్పటివరకు వారు399 రోజులుగా జైలు జీవితాన్ని గడుపుతున్నారు. ఇదే కేసులో ఆఫ్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ను కూడా గత అక్టోబర్లో ఈడి జైలుకు పంపింది. ఇదే కేసు పై మార్చ్ 14 న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను కూడా అరెస్టు చేశారు. ఇప్పటికీ ఈ కేసులో 9 మందిని అరెస్ట్ చేసినారు. గత రెండేళ్లుగా ఈ కేసు నడుస్తుంది. ఈడి, సిబిఐలు 100 సార్లు దాడులు చేశాయి. కుట్రలు, లెక్కలు, ఆరోపణలు కాగితాల మీదే తప్ప క్షేత్రస్థాయిలో ఒక రూపాయి కూడా దొరికింది లేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నుండి కొత్తగా ఏమి తరువాయి 2లో

## నలుగురు చిన్నారులు సజీవదహనం
సెల్‌ఫోన్ చార్జింగ్ అవుతుండగా విద్యుదాఘాతం

**మీరట్ :** ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పల్లవపురం ప్రాంతంలోని ఓ ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ అవుతుండగా విద్యుదాఘాతం ఏర్పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురు చిన్నారులు సజీవ దహనం కాగా, వారి తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. సెలఫోన్ నుంచి చెలరేగిన మంటలు మంచంపై ఉన్న బెడ్‌షీట్‌కు అంటుకున్నాయని చిన్నారుల తండ్రి జానీ పోలీసులకు చెప్పారు. బాధితులను సారికా (10), నిహారిక (8), శంకర్ (6), కలు (4)గా గుర్తించామని పోలీసులు వెల్లడించారు. కాగా, తరువాయి 2లో

## అద్దె వెతలు ఇంకెన్నాళ్లు...
అరకొర వసతులు, భద్రతలేని కార్యాలయాలు
ఇల్లందకుంటలో ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి
పక్కా భవనాలు లేక నిర్వహణ భారం




ప్రజాపక్షం/ఇల్లందకుంట

గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో ఒకటైన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. మండలాల ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ భవనాల నిర్మాణంపై నాటి ప్రభుత్వం దృష్టి సారించకపోవడం వల్ల ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. ఇందుకు సంబంధించి కనీసం ప్రతిపాదనల దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఫలితంగా కొత్త మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అరకొర వసతుల మధ్య కార్యాలయాలను కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. 2016 జులై 04 దసరా రోజున ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు నూతన మండలాల ప్రారంభోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తరువాయి 2లో



# సజీవదహనం
(మొదటి పేజీ తరువాయి)

కూలీ పని చేస్తున్న జానీ ఈ ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి బయటపడగా, అతడి భార్య బబితకు తీవ్రగాయాలు కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను మెరుగైన వైద్యం కోసం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

# ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
(మొదటి పేజీ తరువాయి)

గాలులతో వచ్చే 5 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరుగుతాయి అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పారు. ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ ఎండలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# మద్యం దుకాణాలు బంద్
(మొదటి పేజీ తరువాయి)

మూసి ఉంచాలని స్పష్టం చేశారు. అయితే, స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులకు మాత్రం ఈ ఆదేశాల నుంచి మినహాయించారు. ఈమేరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 26న సాయంత్రం 6 గంటల వరకు మద్యం షాపులు, కల్లుదుకాణాలు, రెస్టారెంట్‌లు మూతపడనున్నాయి. హోలీ వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. హోలీ ఆనందంగా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై ఇష్టారీతిన వేడుకలు జరుపుకుంటూ వచ్చీపోయే వారికి ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్‌లపై వెళ్లే వారిపై, వాహనదారులపై రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా వాహనాలతో రోడ్లపైకి వచ్చి గుంపులు గుంపులుగా ప్రయాణించ వద్దని సూచించారు.

# జైలు నుంచే కేజ్రీవాల్ పాలన
(మొదటి పేజీ తరువాయి)




ఆమె న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా సహాయం తీసుకోవాలని కూడ సిఎం సూచించించారని అతిషి తెలిపారు. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు నీటి, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్నట్టుగా కేజ్రీవాల్ చెప్పారని ఆమె అన్నారు. తాను జైలులో ఉన్నందున ప్రజలకు సమస్యలు రాకూడదని సిఎం భావిస్తున్నారని అతిషి అన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సిఎం సూచించారని తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కేజ్రీవాల్ కోరారని వివరించారు.

# సంతోష్ కుమార్‌పై కేసు
(మొదటి పేజీ తరువాయి)

నంబర్ 129/54లో 1350 చదరపు గజాల స్థలాన్ని నవయుగ సంస్థ కొనుగోలు చేసింది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, ఆ స్థలం కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారని ఈనెల 21న కంపెనీ ప్రతినిధి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 400, 471, 447, 120బి రెడ్‌విత్ 34 ఐపిసి సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. దాంతో పోలీసులు ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేశారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కల్వకుంట్ల కవిత అరెస్ట్ అయ్యారు. ఇప్పుడు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదైంది. పలు కేసుల్లో బిఆర్‌ఎస్ నేతలు ఇరుక్కొంటున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో ఆమోమాయం నెలకొంటోంది.

**రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసు : సంతోష్ కుమార్**

రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసు నమోదు చేశారని మాజీ ఎంపి సంతోష్ కుమార్ అన్నారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసుపై ఆయన స్పందించారు. షేక్‌పేటలోని సర్వే నంబర్ 129/54లో ఉన్న 904 చదరపు గజాల ఇంటి స్థలాన్ని శ్యామ్‌సుందర్ పుల్జాల్ నుంచి 2016లో రూ.3.18 కోట్లకు కొనుగోలు చేశానని, సేల్ డిడ్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా కొనుగోలు ప్రక్రియ జరిగిందన్నారు. ఫోర్జరీ అనే మాటకు తావులేదన్నారు. అదంతా అవాస్తవమన్నారు. ఎనిమిదేళ్లుగా ఎలాంటి న్యాయవివాదం తలెత్తలేదన్నారు. న్యాయపరమైన అంశాలు ఉంటే ముందుగా తనకు లీగల్ నోటీసు ఇచ్చి, వివరణ కోరాలన్నారు. ఫోర్జరీ చేశామని పోలీస్ స్టేషన్‌లో ఎలా ఫిర్యాదు చేశారన్నారు. న్యాయపరంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నా అని సంతోష్ కుమార్ తెలిపారు.

# జంపింగ్‌లకే టికెట్లా!
(మొదటి పేజీ తరువాయి)

మారిపోతున్నారు. ఇటీవల ఉమ్మడివరంగల్ జిల్లాలో ఇలాంటి పరిణామాలు అనేకం చోటు చేసుకున్నాయి. వరంగల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులుగా ఉన్న ఆరూరి రమేష్ బీజేపిలో చేరి వరంగల్ ఎంపి టికెట్ రేసులో ఉండగా, బీఆర్‌ఎస్ మాజీ ఎంపి సీతారాం నయక్ బీజేపిలో చేరి మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి అయ్యారు. ప్రస్తుత సిట్టింగ్ బీఆర్‌ఎస్ ఎంపి పసునూరి దయాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ నుండి వరంగల్ ఎంపి అభ్యర్థి రేసులో ఉండడంతో కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని టికెట్ కోసం ఎదురు చూస్తున్న నాయకులలో ఆందోళన వ్యక్తం అవుతున్నది. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎవరూ ఊహించలేని విధంగా పార్టీని వదిలి బీజేపీలో చేరడంతో వరంగల్ జిల్లా రాజకీయాలు ఒక్కసారి వేడెక్కాయి. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీజేపీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్‌ను తెచ్చుకున్నా ఆయనకు సహకరించబోమని వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు, ఆయా జిల్లాల నాయకులు సైతం భగ్గుమంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పార్టీ మారడంతో ఆయన అనుచరులు అయోమయానికి గురయ్యారు. చేసేదిలేక ఆయన నాయకత్వాన్ని అనుసరించే కొంత మంది నాయకులు, కార్పోరేటర్లు, మాజీ సర్పంచులు ఆయన వెంట నడవాలని యోచిస్తున్నారు. ఆరూరి రమేశ్ బీజేపీలో చేరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా టికెట్ లభించినా కొంత బీజేపీ పార్టీ క్యాడర్లో అనాసక్తి నెలకొని ఉంది. కాగా కాంగ్రెస్ నుండి సిట్టింగ్ బీఆర్‌ఎస్ ఎంపి పసునూరి దయాకర్ పోటీ చేస్తారన్న వార్తలపై కూడా కాంగ్రెస్ నాయకులు, ఆశావహులలో ఆందోళన రేకెత్తిస్తున్నది.

జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తల నుంచి కూడా పసునూరి అభ్యర్థిత్వం పట్ల బలమైన వ్యతిరేకత కనిపిస్తుంది. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ ప్రకటించిన కడియం కావ్య పట్ల కూడా ఆ పార్టీ కార్యకర్తలలో వ్యతిరేఖత కనిపిస్తున్నది. తెలంగాణ ఉద్యమం నుండి ముందుండి పని చేసిన వారికి కాకుండా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్యకు టికెట్ ఎలా కేటాయిస్తరని ఉద్యమ కారులు, ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

# నైజీరియాలో విద్యార్థుల కిడ్నాప్ కథ సుఖాంతం



**అబూజ:** నైజీరియాలో పాఠశాల విద్యార్థుల కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది. సుమారు రెండు వారాల క్రితం నైజీరియన్ పాఠశాల నుండి కిడ్నాప్‌కు గురైన సుమారు 300 మంది విద్యార్థులను ఆదివారం విడుదల చేశారు. వాయువ్య రాష్ట్రమైన కడునాలోని మారుమూల గ్రామంలోని ఓ పాఠశాల నుండి వారిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాన్ చేశారని స్థానిక అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, కడునా రాష్ట్రం కురిగా పట్టణంలోని ఓ పాఠశాల నుంచి విద్యార్థులను ఈ నెల 7న సాయుధ వ్యక్తులు కిడ్నాప్ చేశారు.

అడ్డుకునేందుకు యత్నించిన ఓ వ్యక్తిని కాల్చిచంపారు. విద్యార్థుల్ని తమతోపాటు సమీప అడవుల్లోకి తీసుకు వెళ్లినట్లు సమాచారం. కిడ్నాపైన విద్యార్థుల్లో కనీసం వంది మంది వయు 12 సంవత్సరాల లోపే ఉంటుందని తెలుస్తోంది. విద్యార్థులను విడుదల చేసేందుకు రూ.5 కోట్లు ఇవ్వాలని, లేకుంటే వారిని చంపేస్తామని కిడ్నాపర్లు బెదిరించినట్టు వార్తలు వచ్చాయి. చివరకు వారిని సురక్షితంగా నేడు విడుదల చేయడం గమనార్హం. కాగా, ఘటనపై కడునా రాష్ట్ర గవర్నర్ ఉబా సని స్పందించారు. నైజీరియా అధ్యక్షుడు బొలా టినుబు చూపిన చొరవతోనే విద్యార్థులు ఎలాంటి అపాయం లేకుండా బయటపడ్డారని పేర్కొన్నారు. కిడ్నాపర్లకు ఒక్క పైసా కూడా చెల్లించలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, విద్యార్థుల వివరాలను ఆయన వెల్లడించలేదు.

సాధారణంగా ఇలాంటి ఘటనల్లో కిడ్నాపర్లు కోరిన మొత్తాలను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు జమ చేసి కట్టడం, తమ పిల్లలను విడిపించుకోవడం నైజీరియాలో ఆనవాయితీగా వస్తున్నది. ముఖ్యంగా ఉత్తర నైజీరియాలో అధికంగా విద్యార్థుల కిడ్నాపులు జరుగుతుంటాయి. 2014 నుండి బోర్నో రాష్ట్రంలోని చిబోక్ గ్రామంలో సాయుధ దుండగులు 200 మందికి పైగా విద్యార్థినులను కిడ్నాప్ చేయడం అప్పట్లో సంచలనం రేపింది. కాగా, ఇటీవల కాలం లో ఈ కిడ్నాపులు దేశంలోని వాయువ్య, సెంట్రల్ ప్రాంతాలకు కూడా పాకాయి. సాయుధ దుండగులు నగదు కోసం గ్రామస్థులను, విద్యార్థులను లక్ష్యం గా చేసుకుంటున్నారు.

ఎక్కువ సందర్భాల్లో కిడ్నాపర్లు సొమ్ము రాబట్టుకున్న తర్వాతే బందీలను విడిచిపెడుతుంటారు. ఇప్పుడు కూడా అదే జరిగిందని స్థానికులు అంటున్నారు. కానీ, అధికారులు మాత్రం ఎలాంటి వివరాలు ఇవ్వడం లేదు.

# కక్షపూరితమేనా? (మొదటి పేజీ తరువాయి)

వెళ్లాయి. ఈ కంపెనీ బిఆర్‌ఎస్‌కు 2.5 కోట్ల రూపాయల విరాళాలిచ్చింది. కాగా, 2021–22లో ఆప్ ప్రభుత్వం ఢిల్లీలో కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చింది. మద్యం దుకాణాల లైసెన్సులు దక్కించుకోవడానికి కొంత మంది వ్యక్తులు, సంస్థలు అక్రమాలకు పాల్పడగా, కనీసం 100 కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని తొలుత సిబిఐ ఆరోపించింది. మనీ లాండరింగ్ కోణంలో విచారణను ప్రారంభించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేజ్రీవాల్, కవితసహా ఇప్పటి వరకూ 16 మందిని అరెస్టు చేసింది. ఇలావుంటే, శరత్‌చంద్రా రెడ్డి అప్రూవర్‌గా మారిన వెంటనే, అరబిందో ఫార్మా నుంచి బిజెపికి కోట్లాది రూపాయలు విరాళంగా అందడం ఆశ్చర్యాన్ని, అనుమానాన్ని కలిగిస్తున్నది. ఈ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించినట్టు చెప్తున్న 'సౌత్ గ్రూప్'తో సంబంధాలున్న వారిలో శరత్‌చంద్రా రెడ్డి ఒకరు. వీరంతా ఆప్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన విజయ్ నాయర్ ద్వారా ఆ పార్టీకి వంద కోట్ల రూపాయల ముడుపులు చెల్లించారని ఇడి ఆరోపణ. ఈ మొత్తాన్ని 2022 గోవా ఎన్నికల్లో ఆప్ వాడుకుందనేది ఇడి ఆరోపణల్లో ఒకటి. విమర్శలు వెల్లువెత్తడంతో ఈ లిక్కర్ పాలసీని ఆప్ ప్రభుత్వం రద్దు చేసింది. ఇలావుంటే, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ సీనియర్ నాయకుడు సంజయ్ సింగ్ తదితరులు అదుపులోకి తీసుకున్నప్పటికీ, ఇంత వరకూ ఏ ఒక్క ఆరోపణనూ కోర్టులో ఇడి రుజువు చేయలేకపోయింది. అప్రూవర్లు ఇచ్చి సమాచారం పేరుతో అరెస్టులను కొనసాగిస్తున్నది. రాబోయ సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిజెపి ఈ విధంగా ఇడి, సిబిఐని వినియోగించుకుంటున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలను ఏదో ఒక రకంగా ఇరుకున పెట్టి, రాజకీయ ప్రయోజనాలు పొందాలన్నది బిజెపి ప్రయత్నమని పలువురు నాయకులు ఇప్పటికే ఆరోపిస్తున్నారు. సౌత్‌గ్రూప్‌కే చెందిన ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన కుమారుడు రాఘవ, ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త దినేష్ అరోరా కూడా ఈ కేసులో అప్రూవర్లుగా మారారని ఇడి ప్రకటించింది. అంటే వారు నేరాన్ని అంగీకరించారని పరోక్షంగా చెప్పినట్టే, అలాంటి వ్యక్తుల పర్యవేక్షణలో ఉన్న కంపెనీ నుంచి బిజెపి ఏ విధంగా విరాళాలు తీసుకుందనే ప్రశ్నకు సమాధానం లేదు. ఒకవేళ పార్టీకి తెలియకుండానే అరబిందో ఫార్మా ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసిందని అనుకున్నా, వాటిని బిజెపి ఎన్‌క్యాష్ చేసుకోవడంలో అర్థం ఏమిటి? వీరందరినీ అప్రూవర్లుగా పేర్కొంటూ, వారు ఇచ్చిన సమాచారం మేరకే అరెస్టు జరుగుతున్నాయని ఇడి పనిని సమర్థించడానికి ప్రయత్నం చేస్తున్నదే తప్ప, బిజెపి వద్ద బలమైన వాదన అంటూ ఏదీ లేదు. పైగా శరత్ చంద్రా రెడ్డి పేరు ఇలాంటి కుంభకోణాలు లేదా ఆరోపణల్లో వినిపించడం ఇదే మొదటిసారి కాదు. 2012లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసుకు సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) చార్జిషీట్‌లో ఆయన పేరు ఉంది. 2006లో ఎపి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌తో భూమి విక్రయ ఒప్పందానికి సంబంధించి కేసు ఇది. శరత్‌చంద్రా రెడ్డి మేనేజింగ్ డైరెకర్‌గా ఉన్నప్పుడు ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌కు ప్రయోజనం చేకూర్చింది. ఈ కేసులో విచారణ ఇంకా కొనసాగుతోంది. ఆయన డైరెక్టర్‌గా ఉన్న అరబిందో ఫార్మా ఎందుకు బిజెపికి కోట్ల రూపాయల విరాళాలు ఇచ్చిందో ఊహించడం కష్టం కాదు. 2023, మార్చి 9న హైదరాబాద్ వ్యాపారవేత్త అరుణ్ రామచంద్రన్ పిళ్లైని అరెస్టు చేసిన తర్వాత, ఈ కేసులో కవిత ప్రమేయాన్ని ఇడి జోడించింది. కవితకు తాను బినామీగా వ్యవహరించానని పిళ్లై తన వాంగ్మూలంలో పేర్కొన్నారని ఇడి అంటున్నది. నిజానిజాలు ఎలావున్నా, లోక్‌సభ ఎలక్షన్ నోటిఫికేషన్ ఈనెల 16వ తేదీ, శనివారం వెలువడనుందని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ప్రకటించిన తర్వాత, అంతకు ఒక రోజు ముందు, శుక్రవారం కవితను అరెస్టు చేయడంలోనూ రాజకీయ కోణాలు ఉన్నాయన్నది ప్రతిపక్ష పార్టీల ఆరోపణ. మద్యం కేసు నిజమా? కాదా? అనేది పక్కకుపెడితే, సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో కొనసాగుతున్న దాడులు, అరెస్టులు విమర్శలకు కారణమవుతున్నాయి. రాజకీయ కక్షతో బిజెపి ఢిల్లీ మద్యం కేసును భూతద్దంలో చూపిస్తూ, ఇడిని అడ్డం పెట్టుకొని, రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

# ఫోన్‌ట్యాపింగ్ (మొదటి పేజీ తరువాయి)

కాగా అతని అమ్మగారి ఊరు పర్వతగిరి.అలాగే బీఆర్‌ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించి ఎస్‌ఐబి చీఫ్‌గా పని చేసిన టి.ప్రభాకర్ రావుది హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం. ప్రభాకర్ రావు 2020 జూన్ 30న పదవీ విరమణ చేయగా నాటి సీఎం కేసిఆర్‌కు ఉన్న సత్సంబధాలతో రాష్ట్ర ఎస్‌ఐబి చీఫ్‌గా నియమించినట్లు చెబుతున్నారు. పై అధికారుల సూచన మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు చెప్పడంతో హైదరాబాద్‌లోని మాజీ ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్ రావు ఇంట్లోనూ పోలీసులు సోదాలు చేపట్టడం వరంగల్ పోలీసులలో చర్చనీయాంశమైంది. ఇదే చర్చ జరుగుతున్న క్రమంలో భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావు సైతం ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వాములు అయ్యారంటూ పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఇద్దరు సీఐలకు కూడా ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు, ఇప్పటికే వారిని కూడా పోలీసులు విచారణ కోసం అరెస్టు చేసినట్లు చెబుతున్నారు. మాజీ ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్ రావు మొదలుకొని మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావు, ప్రణీత్‌కు సహకరించిన ఇద్దరు సీఐల వరకూ మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లా వారే కావడంతో ఈ కేసులో జిల్లా పోలీసులలో ఉత్కంఠ రేపుతున్నది. వీరితో పాటు ఫోన్‌ట్యాపింగ్ కోసం ఎంచుకున్న వార్ రూమ్ కూడా జిల్లాలోని పర్వతగిరి కావడంతో ఈ వ్యవహారం అంతా వరంగల్ చుట్టూ తిరుగుతున్నది. కాగా జిల్లా పోలీసులతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ప్రణీత్ రావు బంధువు అన్న ప్రచారం జరుగుతుండడంతో బీఆర్‌ఎస్ నాయకులలోనూ ఆందోళన వ్యక్తం అవుతున్నది. మరోవైపు ఎర్రబెల్లి స్వగ్రామం పర్వతగిరి కావడం, పర్వతగిరిలోనే వార్ రూమ్ ఏర్పాటు, ఫోన్ ట్యాపింగ్‌లు జరిగినట్లు పోలీసులు గుర్తించడం ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. దయాకర్ రావు, దుగ్యాల ప్రణీత్ రావు ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఇద్దరి మధ్య బంధుత్వం ఉందన్న ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏఏ రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల ఫోన్ కాల్స్ రికార్డు చేశారో, ఏ కాంట్రాక్టర్,వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేశారోనన్న ఆందోళన వ్యక్తం అవుతున్నది. హైదరాబాద్‌లో ఎస్‌ఐబి కార్యాలయంతో పాటు వరంగల్ జిల్లాలోని పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేయడం, దుగ్యాల ప్రణీత్ జిల్లాకు చెందిన వాడు కావడంతో ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ పై ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దృష్టి పడింది.

# అద్దె వెతలు ఇంకెన్నాళ్లు? (మొదటి పేజీ తరువాయి)




ప్రారంభించింది. జిల్లాలో ఏర్పాటు చేసిన కొత్త మండలాల జాబితాలో జమ్మికుంట మండలాన్ని విడదీసి ఏర్పాటు చేసిన ఇల్లందకుంటలో ప్రభుత్వ కార్యాలయాలను హంగు, ఆర్భాటాల మధ్య అప్పటి జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, నాటి పోలీస్ కమిషనర్ కమలాసన్ రెడ్డిలు ప్రారంభించారు. రెవెన్యూ కార్యాలయాన్ని సీతారామచంద్ర స్వామి దేవస్థానంకు చెందిన కమ్యూనిటీ హాలులో, పోలీస్ స్టేషన్‌ను టిటిడి అతిథి గృహంలో, మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ప్రైవేట్ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. వీటిలో సౌకర్యాల లేమి కారణంగా అనేక దురావస్థల మధ్య అధికారులు ప్రభుత్వ పాలనను ఈడ్చుకొస్తున్నారు.

**ప్రైవేట్ భవనాల్లో ఆఫీసులు..**

ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయంలో వివిధ స్థాయి సిబ్బందికి ప్రత్యేక గదులు లేవు. తహసీల్దార్ గది మినహా ఇతర విభాగాలన్నీ ఒకే హాలులో కొనసాగించాల్సిన దౌర్భాగ్యం నెలకొంది.




కనీసం విలువైన దస్త్రాలను భద్రపరిచే పరిస్థితి కరువయ్యింది. చుట్టూ ప్రహరీ గోడ లేక రాత్రివేళ రక్షణ లేకుండా పోయింది. పోలీస్ స్టేషన పరిస్థితి ఇంచుమించు ఇదే.. సిబ్బందికి విశ్రాంతి గదులు లేవు. కస్టడీలో ఉన్న నిందితులను ఉంచడానికి సెల్(లాకప్ గదులు) లేవు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి నివాసం కరువు. ఫలితంగా అంతా జమ్మికుంట పట్టణంలో అద్దెకు ఉంటూ ఇక్కడ విధుల్లో కొనసాగుతున్నారు. రాత్రివేళ సిబ్బంది పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం, ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన మండల పరిషత్ కార్యాలయం అద్దె చెల్లించని కారణంగా ఇంటి యజమాని కార్యాలయానికి తాళం వేయడంతో కార్యాలయాన్ని ఇటీవల మండల వనరుల కేంద్రం భవనంలోకి తరలించారు. వ్యవసాయశాఖ అప్పట్లో దేవాలయ విశ్రాంతి గదుల్లో ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల పూర్తయిన రైతు వేదికకు మార్చారు. మిగతా కార్యాలయాలన్నీ ఏదో చోట ఏర్పాటు చేసిన నెట్టుకొస్తున్నారు.

**సర్కారు చొరవ చూపేనా?**

ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కోసం నాటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఇల్లందకుంట మండల కేంద్రానికి సమీపంలోని ఎర్రగుట్ట వద్ద సర్వే నెంబర్ 387లో 4ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. నిధుల కొరత కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. కొత్త మండలాల ఏర్పాటుతో పరిపాలన ప్రజల ముంగిట్లోకి వచ్చినా శాశ్వత భవనాలు లేక అసౌకర్యాల లేమితో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు చొరవ చూపాలని గత ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై పక్కా భవనాలకు నోచుకోని ఇల్లందకుంట మండల స్థితిగతులు కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మారుతుందన్న ఆశాభావాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన మౌలిక సదుపాయాల రూపకల్పన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదిక తెప్పించుకుని తగు నిధులు కేటాయించి ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు

# సరిహద్దులు దాటుతున్న రేషన్
(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా సరిహద్దు మహారాష్ట్ర లోని తాలూకా కేంద్రమైన సిరొంచా సమీపంలో రహస్య ప్రదేశంలో ఏర్పాటు చేసిన రేషన్ డెన్ కు తరలించి అక్రమ రవాణా కార్యకలాపాలకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రాంతాల్లో దళారులు రేషన్ బియ్యాన్ని కిలో రూ.8 నుండి 10 చొప్పున రేషన్ వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి రూ.18 చొప్పున అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం.

దళారుల నుండి చేతులు మారిన అక్రమ రేషన్ బియ్యాన్ని రేషన్ వీరప్పన్ మహారాష్ట్ర ప్రాంతాల్లో రూ.50 చొప్పున హోల్ సేల్ ధరలకు విక్రయించడం గమనార్హం. ఆహార భద్రత కార్డు కలిగిన పేద, మధ్యతరగతి వర్గాల కోసం ప్రభుత్వం ప్రతి నెల కుటుంబంలోని ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తుండగా దొడ్డు బియ్యం కారణంగా రేషన్ బియ్యం వినియోగించకపోవడంతో ఇదే అదునుగా భావించిన రేషన్ దళారులు వారి వద్ద నుండి తక్కువ ధరకు సేకరించి మహారాష్ట్రలోని సిరొంచా స్థావరానికి తరలించి జోరుగా అక్రమ రవాణా కొనసాగించడం నిత్యకృత్యంగా మారింది.

**మామూళ్లు ఫుల్.! తనిఖీలు నిల్..!**

తెలంగాణ సరిహద్దులు దాటించి భారీ ఎత్తున రేషన్ బియ్యం అక్రమ దందా కార్యకలాపాలు కొనసాగిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులపై జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించాల్సిన రెవెన్యూ సిబ్బంది అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. సంబంధిత అధికారులకు రేషన్ అక్రమార్కుల నుండి భారీగా ముడుపులు అందుతున్నాయనే బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద నిరంతరం రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టి అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం వాటిపై కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెక్ పోస్ట్ సిబ్బంది కనుసన్నల్లో రేషన్ బియ్యం అక్రమ దందా సాఫీగా సాగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. కాగా అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ముందుగానే మాఫియా ఫోన్ ద్వారా సమాచారం అందించి రేషన్ అక్రమ దందా రాత్రి, పగలు అనే తేడా లేకుండా యదేచ్ఛగా కొనసాగిస్తు న్నట్లు సమాచారం.

ఈ వ్యవహారంలో చెక్ పోస్ట్ సిబ్బందికి పెద్ద ఎత్తున మామూళ్లు అందించి రేషన్ బియ్యం అక్రమ దందాను స్మగ్లింగ్ మాఫియా అడ్డు అదుపూ లేకుండా ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

కాగా గ్రామ స్థాయి అధికారులు నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు రేషన్ మాఫియా మామూళ్ల పంపకాలు ఎరగా వేసి రేషన్ బియ్యం అక్రమదందా నిరాటంకంగా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాళేశ్వరం వద్ద శుక్రవారం విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యం అక్రమ ఆగడాలపై దాడులు జరిపి నాలుగు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 700 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకోవడంతో రేషన్ మాఫియా గుండెల్లో రైళ్లు పరుగెత్తడం కొసమెరుపు.

# దాడులు చేయిస్తున్న మోడీ!
(మొదటి పేజీ తరువాయి)

రాబడతారో తెలియదు. ఎలక్ట్రోరల్ బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన వెంటనే 'సిసిఏ'ను అమలులోనికి తెచ్చి చర్చనీయాంశంగా మార్చారు. ఆ తరువాత బాండ్ల రూపంలో అధికార బిజెపి పార్టీ వేలకోట్లు భారీగా విరాళాలు దండుకున్న వ్యవహారం మార్చి14 న ఎన్నికల కమిషన్ వెల్లడించడంలో ఇన్నాళ్లుగా పిల్లి మొగ్గ లేస్తున్న ఎస్ బి ఐ చివరికి కోర్టు ఆగ్రహంతో యునిక్ నెంబర్లతో సహా అందజేసిన మరుక్షణమే కేజ్రీవాల్ ను అరెస్టు చేశారు. బద్దలైన తమ బాండ్ల బండారం నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కూడా ఈ చర్యల వెనుక ఒక వ్యూహంగా బిజెపి వ్యవహరిస్తుం ది. అప్పటి యూపీఏ ప్రభుత్వం 2 జి స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో రూ.1.76 లక్షల కోట్లు ఆనాటి టెలికాం మంత్రి ఏ.రాజా అవినీతికి పాల్పడిందని, ఆ కేసుల్లో సి.బి.ఐ సరియైన సాక్షాదారాలు చూపలేకపోయారని ప్రత్యేక కోర్టు అభిప్రాయపడి 2017 లో నిందితులను అందరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఆ తీర్పు పై 2018 మార్చ్ లో సిపిఐ దాఖలు చేసిన అప్పిల్ ను, ఇప్పుడు ఎన్నికల ముందు 6 ఏండ్ల తర్వాత మార్చి 22 న ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించింది.. ఇది పూర్తిగా ఎన్నికల ముందు రాజకీయ కుట్రలో భాగంగా వివక్ష పార్టీల నాయకులపై వేధింపులకు గురి చేసేదిగా ఉందని రాజకీయ పరిశీలకులు, మేధావులు విశ్లేషణ.

టీచర్ రిక్రూట్మెంట్ కేసులో బెంగాల్ మంత్రి చంద్రనాథ్ సింహ ఇంటిపై మార్చి 22న ఈ డి దాడులు నిర్వహించింది. మరో మంత్రి సోదరుడు టీఎంసీ నేత స్వరూప్ బిశ్వాస్ నివాసంలో వరుసగా మూడో రోజులుగా ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు కొనసాగించారు. అదేవిధంగా పోటీలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్లపై ఇన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈ డీ), ఐటి దాడులను చేయడం ద్వారా భయాందోళనలను కల్పిస్తుంది.

కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్ 1990 కాలంలో రూ.14 లక్షలకు ఐటీ చెల్లించాలని పంపించిన నోటీస్ కు ఐటి చెల్లించలేదని కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను నేడు ఎన్నికల ముందు మార్చి 14న స్తంభింపజేయడం జరి గింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీకి ఎన్నికల కోసం నిధులు రాకుండా, వారు సేకరించుకున్న నిధులను ఖర్చు పెట్టుకోకుండా.. ఎన్నికల్లో పోరాడే సామర్థ్యాన్ని దెబ్బతీసే విదంగా మోడీ, అమిత్ షా కలిసి క్రిమినల్ యాక్షన్ పాటుపడ్డారని కాంగ్రెస్ ఆరోపించింది.

వివిధ ప్రతిపక్ష పార్టీ నాయకుల ఇండ్లపైన ఐ టి, ఈ డి దాడులు దేశ రాజకీయాల్లో సంచలనాలు సృష్టిస్తు న్నా యి. మోడీని సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ: ఢిల్లీలో మూడు సార్లు అధికారంలోకి వచ్చి పట్టు సాధించిన తర్వాత పంజాబు లో అనూహ్య విజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లో 12.92 శాతం ఓట్లు, 5 ఎమ్మెల్యేలను గెలిచి బిజెపికి సవాల్ విసిరే స్థాయికి చేరింది. గోవాలో గణనీయ ఫలితాలను అందుకున్నది. జాతీయ పార్టీగా గుర్తింపు సాధించి, బిజెపి, కాంగ్రెస్కు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగే ప్రయత్నాల్లో ఉంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో బిజెపికి ఆమ్ ఆద్మీ పార్టీ కొరకరాని కొయ్యగా మారిపోయింది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని ఢిల్లీలో చిత్తుగా ఓడించింది. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీని బిజెపి పెద్దలు లక్ష్యంగా చేసుకున్నారనే వాదన బలంగా వినిపిస్తుంది. ఆప్ ను పూర్తిగా నిర్వీర్యం చేసి దిశగానే కేంద్రంలోని పెద్దలు పావులు కదుపుతున్నారని, ఈ దిశగానే దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని ఆరోపణ ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి ఎన్నికల్లో ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉంది. ఢిల్లీ, పంజాబ్, గుజ రాత్, గోవా, హర్యానా, అస్సాంలో నూ పోటీ చేయాలని ఆప్ నిర్ణయించింది. కేజ్రీవాలు అరెస్ట్ చేస్తారని ప్రచారం దాదాపుగా ఏడాదిగా ఉండగా.. సరిగ్గా లోక్సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న వేళ అరెస్టు చేయడం వెనుక బిజెపి రాజకీయ కుట్ర ఉన్నదని ఆ నేతలు ఆరోపిస్తున్నారు.

**ఈడి –మోడీ కి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలు :**

లోకసభ ఎన్నికలు నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇండియా కూటంలోని భాగస్వామ్య పార్టీల నాయకుల ఇండ్లపై ఈ డి, ఐ టి, సిబిఐ దాడులను ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆ రెస్టులను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులతో పాటు వివిధ ప్రాంతాలలో కాంగ్రెస్, ఇండియా కూటమిలోని పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ఆందోళన చేపడుతున్నారు. ఢిల్లీలో ఈడీ కార్యాలయం ముందు కూడా కార్యకర్తలు ధర్నాలు చేపడుతున్నారు.వెంటనే వివక్ష పార్టీల నాయకులపై అక్రమకేసులు అరెస్టులను ఆపాలని డిమాండ్ చేస్తున్నా రు.



''జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ దంపతులను హైదరాబాద్, జుబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దంపతులు ఆదివారం సన్మానించారు.



ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీతలు అందె భాస్కర్ (డప్పు వాయిద్యం), పేరణి రాజ్ కుమార్ నాయక్ (పేరిణి నృత్యం) సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని రేవంత్ రెడ్డి అభినందించారు.



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎంఎల్ఎ టి.పద్మారావు గౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న బిఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ. చిత్రంలో మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, ఎంఎల్ఎలు కాలేరు వెంకటేశ్, గోపినాథ్, ముషీరాబాద్ నాయకులు, కార్యకర్తలు

## లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి డబుల్ డిజిట్ సీట్లు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బిజెపి కార్యాలయంలో ఆదివారం కిషన్ రెడ్డి అధ్యక్షతన పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి నేతలు సునీల్ బన్సల్ చంద్రశేఖర్, బండి సంజయ్, డాక్టర్ కె. లక్ష్మణ్, మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలు చర్చించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో మెజార్టీ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టామన్నారు. తెలంగాణలో కూడా పార్లమెంట్ ఎన్నికల్లో తమకు మంచి సానుకూల వాతావరణం ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ముఖ్యమైన నాయకుడిని సమన్వయ కర్తగా నియమించుకోవాలని కోరారు. ప్రతి ఇంటికెళ్లి ప్రతి ఓటరును కలవాలని కేడర్‌కు సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపికి డబుల్ డిజిట్ సీట్లు వస్తాయని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## యుపిలో 16 స్థానాలకు బిఎస్‌పి అభ్యర్థుల ప్రకటన

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలకు బిఎస్‌పి అభ్యర్థులను ప్రకటించింది. మొత్తం 80 స్థానాలకు గానూ 16 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఆదివారం వెల్లడించింది. ఇంతకు ముందే కొన్ని జిల్లాల్లో పార్టీ ఇన్‌చార్జి జిల్లా స్థాయిలో అభ్యర్థులను ప్రకటించారు. శహరాన్‌పూర్ నుంచి మాజిద్ అలీ, కైరానా నుంచి శిర్పాల్ సింగ్, ముజఫర్‌నగర్ నుంచి దారా సింగ్ ప్రజాపతి, బిజ్నూర్ నుంచి విజయేంద్రసింగ్, నాగిన నుంచి సురేంద్రపాల్ సింగ్, మోరదాబాద్ నుంచి ఇర్ఫాన్ సైఫీలు పోటీ చేయనున్నారు. అదే విధంగా రామ్‌పూర్ నుంచి జిషన్ ఖాన్, సంభాల్ నుంచి శౌలత్, అమ్రో నుంచి మోజాహిద్ హుస్సేన్, మీరట్ నుంచి దేవ్రత్ త్యాగీ, బఘపట్ నుంచి ప్రవీణ్ బన్సాల్ బరిలో నిల్వనున్నట్లు బిఎస్‌పి ఒక ప్రకటనలో తెలిపింది.

### అవినీతి, అక్రమాలు పారద్రోలడానికి

# రాజకీయాలకు యువత ఆకర్షితులు కావాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అవినీతి, అక్రమాలను పారదోలడానికి యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, చెడు వ్యసనాలను దూరం చేసేందుకు,ఆరోగ్యవంతులుగా ఉండేందుకు క్రీడలు అవసరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి. నర్సింహా పిలుపునిచ్చారు. ఎఐవై ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడోత్సవాల ముగింపు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం హైదరాబాద్,హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ ప్రధానోత్సవ కార్యక్రమానికి ఈటి. నర్సింహా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చెస్, క్యారంబోర్డ్, ఖో ఖో, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు,సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

ఈ సందర్భంగా ఈటి. నర్సింహా మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా అవసరమని,గ్రామీణ స్థాయి నుండే క్రీడలను ప్రోత్సహించి, అధిక నిధులు కేటాయించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైన సమయంలో, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఎ ఐ వై ఎఫ్ క్రీడలు నిర్వహించడం హర్షధాయకమన్నారు. క్రీడలు ప్రతి మనిషి జీవనంలో ఒక వ్యాయామంగా మారాలని, మానసిక పునరుత్తేజానికి, ఆరోగ్యకరమైన జీవనానికి ఆవశ్యమని చెప్పారు. పౌష్టికాహార లోపంతో యువత శారీరకంగా ఎదుగుదల కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు.యువత నిత్యం క్రీడల్లో పాల్గొనడం ద్వారా చెడు వ్యసనాలకు దూరం కావొచ్చని, నేడు రాష్ట్రంలో మాధకద్రవ్యాలకు బానిసై అనేక మంది విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వ్యాసనాల మత్తులో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలు, అవినీతి, అక్రమాలతో తారవిల్లుతోందని, కేవలం బడా కార్పొరేట్ వ్యాపార బడా బాబులు మాత్రమే ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని, తద్వారా సమాజ మార్పు సాధ్యం కాదని ఆయన చెప్పారు. కేవలం వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు మాత్రమే స్థానం ఉంటుందని, ఇది సమాజ నిర్మాణానికి విఘాతం కల్గిస్తుందని విమర్శించారు. అందుకే నేటి నవతరం రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, రాజకీయాలంటే నిస్వార్థ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.



సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి మాట్లాడుతూ యువతను మతోన్మాద రాజకీయాల వైపు మళ్లిస్తున్న పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. దేశ ఐక్యత అంటే అన్ని మతాలు, కులాల సమూహమేనని చాటి చెప్పేలా యువత సన్నద్ధం కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు,కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, ఎ ఐ వై ఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజీద్,అనిల్, మహేష్, భాస్కర్, శరత్, సజ్జద్‌లతో తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలుమాని పాలనపై దృష్టి పెట్టండి

### రైతులకు పంట నష్ట పరిహారం ఎకరాకు 25 వేలు చెల్లించాలి

### మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** కాంగ్రెస్ పాలకులు హైదరాబాద్‌లో రాజకీయాలు మానీ ప్రజా పాలనపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్‌తండా గ్రామంలో ఇటివల ఎండిపోయిన పంటపొలాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి,మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో పరిశీలించి రైతులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చిన తర్వాత ప్రజలకు,రైతులకు కష్టాలు మొదలయ్యాయని, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేల ఇండ్లలోకి పోయి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం మానేసి, కాంగ్రెస్ ప్రభుత్వం గేట్లు తెరిచాం అని చెప్పుకోవడం మానీ ప్రాజెక్టుల గేట్లు తెరిచి రైతులను ఆదుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కాంగ్రెస్ పాలకులకు రైతులకు పరామర్శించే ఓపిక లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాలలో పంటలు ఎండి పోయాయి. దేవరుప్పుల మండలంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వైఫల్యంతోనే దేవాదుల ప్రాజెక్టులతో నీళ్లు ఉన్నా రైతుల పంటించుకోకపోవడం వల్లే పంటలు ఎండి పోయాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి గ్రామంలో 100కు పైగా బోర్లు వేశారని, బావుల్లో పూడికతీత పనుల చేపట్టి రైతులు అప్పులు ఊబిలో చిక్కుకున్నారని తెలిపారు. పండించిన పంటకు రూ. 500 బోనస్ అందించాలని, అధికారంలోకి రాగానే రుణమాఫీ, రైతు బంధు ఇస్తామన్నా మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని అన్నారు. గిరిజనులు ఎండిన పంటలను చూపెడుతూ .. మునుపెన్నడూ ఎండిన దాఖలాలు లేవని యాసింగి పంటలో యాదకర్‌రావు దయ వల్ల పుష్కలంగా నీళ్లు ఉండేవని, పొద్దున చెబిదే సాయంత్రం కల్లా నీళ్లు వచ్చేవని, దేవున్ని విడిచి, దయ్యాన్ని తెచ్చుకున్నామని రైతులు హరీష్‌రావు ముందు మొరపెట్టుకున్నారు. తాము లక్షలు అప్పులు చేసి బోర్లు వేసిన ప్రయో జనం లేదని , పంటలను కాపాడుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమరు ప్రత్యేక చొరువ చూపి నష్టపరిహారం చెల్లించాలని వజ్ఞప్తి చేశారు. వారి వెంట బిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# రైతుల నోట మట్టికొడుతున్న సర్కార్

### కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బి.వినోద్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లే నెపంతో మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగినాయనే సాకును చూపి ప్రాజెక్టులను ఎడారిగా మార్చి కాంగ్రెస్ సర్కారు రైతుల నోట్లో మట్టికొడుతుందని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని మానేరు కట్ట వద్ద ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావులతో కలిసి ఎల్ఎండి ప్రాజెక్టును పరిశీలించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతురాజ్యం తెస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులను కన్నీరు పెట్టిస్తోందని దుయ్యబట్టారు. గోదావరి నదిలో రోజుకు 5 వేల క్యూసెక్కుల నీళ్లు వృధాగా పోతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో 50 టిఎంసిల వరకు నీరు వృధాగా సముద్రంలో కలిసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ చివరినాటికి మేడిగడ్డ కుంగిన పిల్లర్ల వద్ద కాఫర్ డ్యాం నిర్మాణం చేసి ఉంటే ఇప్పుడు ప్రాజెక్టుల్లో నీళ్లు పుష్కలంగా ఉండి పంట పొలాలకు సాగునీళ్లు అందేవన్నారు. ఐదేళ్లలో బండి సంజయ్ ఒక్క గుడి, ఒక నవోదయ పాఠశాల తేలేదని, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాల అభివృద్ధి కోసం నయా పైసా నిధులు తేలేదన్నారు. తాను, గంగుల కమలాకర్‌తో కలిసి అప్పటి టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి దగ్గరకు వెళ్లి కరీంనగర్‌లో టిటిడి ఆలయం నిర్మాణం కోసం రూ.25 కోట్లు మంజూరు చేయించి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. 2014 నుంచి 2019 వరకు ఎంపిగా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వేలైన్ మంజూరీ చేయించానన్నారు. చుట్టుపక్కల నాలుగు జాతీయ రహదారులు, స్మార్ట్‌సిటీలో వెయ్యికోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

**తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడండిః గంగుల**

వేసవికాలం దృష్ట్యా నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. ఆదివారం లోయర్ మానేరు డ్యాంలో అడుగంటిన నీటి నిల్వలను కరీంనగర్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ సునీల్ రావు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్, మానకొండూర్‌తో పాటు నగర చుట్టుపక్కల గ్రామాలకు తాగునీరు అందించే ఎల్ఎండిలో నీటి నిల్వలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం ఎల్ఎండిలో 5.3 టీఎంసిల నీరు నిల్వ ఉందని, తమ ప్రభుత్వ హయాంలో తాగునీటి అవసరాలు తీర్చిన తర్వాతనే దిగువకు సాగునీరు అందించాలనే జీవో ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.



## కేసుల పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బిజెపి నాయకుల యత్నం

### బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల నేపథ్యంలో కేసుల పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బిజెపి నాయకులు ప్రయత్నిస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి విమర్శించారు. లిక్కర్ కేసులో ఆధారాలు ఉన్నాయని చెబుతున్న కిషన్ రెడ్డి, వాటిని ఇడికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు కమ్ముకొస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సిఎం, మంత్రులు వ్యవసాయ రంగంపై సమీక్ష నిర్వహించి, ఏ పంటలు పెట్టుకోవాలనే అంశంపైన రైతులకు ఒక్క డైరెక్షన్ ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్, కేజ్రీవాల్‌తో బిజెపి ఓడిపోతుందని భయపడ్డారని, లోక్‌సభ ఎన్నికల్లో లబ్ది పొందాలనే కెసిఆర్ గొంతు నొక్కేందుకు ప్రయత్రిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బిజెపి ఇద్దరూ కెసిఆర్‌పైన దాడి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులైందని, ఇప్పటి వరకు రుణ మాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. లక్షల ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నీళ్ల లేక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నదని తెలిపారు.

కాంగ్రెస్ మంత్రులు పాలనను గాలికొదిలేశారని ఆరోపించారు. నాగార్జున సాగర్ కట్ట మీదకు వెళ్లేందుకు మంత్రులు భయపడుతున్నారని చెప్పారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ నల్గొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి,క్యామ మల్లేష్, మాజీ ఎంఎల్ఎ కంచర్ల భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## యూట్యూబ్ ఛానళ్లపై పరువు నష్టం దావా, క్రిమినల్ కేసులు : కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన కొన్ని యూట్యూబ్ ఛానళ్లు ఎలాంటి ఆధారాలు లేకుండానే అడ్డగోలుగా, అసత్యాలను పదే పదే ప్రసారం చేస్తున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఇటువంటి యూట్యూబ్ ఛానళ్లపైన పరువు నష్టం ధావాలతోపాటు, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నందుకు క్రిమినల్ కేసులను నమోదయ్యేలా ఫిర్యాదు చేస్తామని కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తంబ్ నెయిల్స్ పెడుతూ, వార్తల పేరుతో శుద్ధ అబద్దాలను చూపిస్తున్నాయని మండిపడ్డారు. గుడ్డి వ్యతిరేకత వల్లనో, లేదా అధికార పార్టీ ఇచ్చే డబ్బులకు ఆశపడి ఇటుంటి నేరపూరితమైన, చట్టవిరుద్ధమైన వీడియోలను, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. వ్యక్తిగతంగా తనతో పాటు, తమ పార్టీని దెబ్బతియాలన్న కుట్రలో భాగంగానే జరుగుతున్నట్టు భావిస్తున్నామని పేర్కొన్నారు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ చేస్తున్న దుర్మార్గ, కుట్రపూరిత చర్యలను చట్టబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. ఇటువంటి యూట్యూబ్ ఛానళ్లను నిషేధించాలని యూట్యూబ్ కు అధికారికంగా ఫిర్యాదు కూడా చేస్తామన్నారు. ఇప్పటికైనా తమ తీరును మార్చుకోవాలని కెటిఆర్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హోలీ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ హోలికి కొత్త కొత్త రంగులతో కొత్తదనానికి మరిన్ని విజయాలకు స్వాగతం పలుకుతూ, అందరి జీవితాలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రవాణ, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ బేధ భావాలు వీడి పరస్పర ప్రేమాభిమానాలతో సంతోషంగా మోదుగు పూలవంటి సహజ సిద్ధమైన రంగులతో వసంత కాలానికి నాందిగా మొదలైన హోలీ పండుగను జరుపుకోవాలని కోరారు. సహజసిద్ధమైన రంగులతో హోలీ పండుగను జరుపుకోవాలని, పరస్పర ప్రేమ, సహృద్భావం, ఆప్యాయతలతో హోలీ పండుగను ఆనందోత్సహాల మధ్య నిర్వహించుకోవాలన్నారు. చిగురించే ఆశలతో ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లోకి కొత్తదనాన్ని ఆహ్వానించే హోలీ పండుగ భారతీయ సంప్రదాయమన్నారు. ఇది ఎంతో అందంగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు.

## నరేంద్ర మోడీపై అజయ్‌రాయ్ పోటీ

### నాల్గవ జాబితా ప్రకటించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలకు 46 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ నాలుగో జాబితాను శనివారం రాత్రి విడుదల చేసింది. రాజ్‌గఢ్ నుంచి మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ పోటీ చేయనున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి నుంచి ఆ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు అజయ్ రాయ్ బరిలోకి దిగనున్నారు. తమిళనాడులోని శివగంగ నుంచి కార్తీ చిదంబరం, విరుదునగర్ నుంచి మాణికం ఠాగూర్ పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో 12, ఉత్తర్‌ప్రదేశ్‌లో 9, తమిళనాడులో 7, రాజస్థాన్‌లో 3, ఉత్తరాఖండ్, మణిపూర్, జమ్ము కశ్మీర్‌లో రెండేసి స్థానాలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. వాటితోపాటు అసోం, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, అండమాన్ నికోబార్ దీవులలో ఒక స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. తాజా జాబితాతో కలిపి కాంగ్రెస్ ఇప్పటివరకు 184 మంది అభ్యర్థులను ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీపై వారణాసి నియోజకవర్గం నుంచి ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ పోటీ చేయనున్నారు. అజయ్‌రాయ్ ఇదివరకే అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వారణాసి లోక్‌సభ స్థానం నుంచి 2009లో సమాజ్‌వాదీ పార్టీ తరఫున 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఆ రకంగా మోడీపై పోటీ ఇది మూడోసారి కానుంది. బిజెపి విద్యార్థి విభాగం ఎబివిపిలో రాజయ్ రాజకీయ జీవితం ప్రారంభించారు. 1996–2007 మధ్య మూడు సార్లు బిజెపి తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత అసెంబ్లీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2012లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కాగా, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటీవల బిఎస్‌పి నుంచి వచ్చి చేరిన లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీకి అమ్రోహా సీటు కేటాయించింది. బారాబంకి ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నాయకుడు పిఎల్ పునియా తనయుడు తనూజ్ పునియా పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్‌గఢ్ నుంచి సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్, రత్లాం నుంచి కాంతిలాల్ బూరియాను బరిలోకి దింపింది. తమిళనాడులోని విరుధునగర్ నుంచి ఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్‌ను రంగంలోకి దింపింది. అదే స్థానం నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి అయిన సినీనటి రాధికా శరత్‌కుమార్‌తో తలపడనున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వికాస్ ఠాక్రే పోటీ చేయనున్నారు.

# మెదక్ లోకసభకు ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి

- రేసులో ఉన్న నీలం మధు, చాగండ్ల నరేంద్రనాథ్
- బిఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామ్‌రెడ్డి, బిజెపి అభ్యర్థిగా రఘునందన్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా వెలుగు వెలిగిన మెదక్ లోకసభ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ నియోజకవర్గం కావటంతో పార్టీ అధిష్ఠానం ప్రతిష్టాత్మకంగా తీసుకొని సమర్థుడైన అభ్యర్థి కోసం అన్వేషిస్తుంది. మెదక్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో సిద్దిపేట జిల్లాకు చెందిన గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజక వర్గాలు, మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి జిల్లాలో పటన్‌చెరువు, సంగారెడ్డి ఏడు నియోజక వర్గాల్లో విస్తరించి ఉంది. మెదక్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, మిగత ఆరు నియోజక వర్గాల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంది.

కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పటాన్‌చెరువు మండలం చిట్కుల్ సర్పంచ్ చిట్కుల్ మధు, పారిశ్రామిక వేత్త, నరేన్ ట్రస్టు అధినేత చాగండ్ల నరేంద్రనాథ్‌లు తీవ్ర స్థాయిలో పోటీ పడుతున్నారు. ముందుగా మాజీ ఎంఎల్ఎ మైనంపల్లి హన్మంత్‌రావు, సంగారెడ్డి మాజీ ఎంఎల్ఎ జగ్గారెడ్డిలు సైతం టికెట్ ఆశించి తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. కాని జగ్గారెడ్డి సతీమణి నిర్మల జగ్గారెడ్డికి పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కార్పొరేషన్ పదవి దక్కటం పోటీ నుండి విరమించుకున్నట్లు సమాచారం. ముందుగా ఉత్సాహం చూపిన మైనంపల్లి హన్మంత్‌రావు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా టికెట్ పోటీ నుండి తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే లోకసభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువటంతో బిజెపి నుండి మాజీ ఎంఎల్ఎ రఘునందన్‌రావు, బిఆర్ఎస్ పార్టీ నుండి ఎంఎల్‌సి వెంకట్రామ్‌రెడ్డిని ప్రకటించా రు. కాని కాంగ్రెస్ టికెట్ మాత్రం ఇంకా ఖరారు కాలేదు. కాంగ్రెస్ నుండి నీలం మధు దాదాపు ఖరారైందని.. పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నట్లు ప్రచారం జరుగుతున్న వేళ అనూహ్యంగా చాగండ్ల నరేంద్రనాథ్ తెరమీదకు వచ్చారు. ఢిల్లీలో మకాంవేసిన నరేంద్రనాథ్ కాంగ్రెస్ టకెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పటాన్‌చెరువు మండలం చిట్కుల్ సర్పంచ్ నీలం పటాన్‌చెరువు నుండి కాంగ్రెస్ టికెట్ ఆశించి ప్రయత్నాలు చేయగా ముందుగా ఖరారు చేశారు. ఆరోగ్య,వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అలక వహించి రాజీనామకు సిద్ధ పడటంతో తిరిగి కాటం శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ కేటాయించారు. దీంతో నీలం మధు బిఎస్‌పి పార్టీ నుండి పోటీ చేసి 46వేలకు పైగా ఓట్లు సాధించాడు. తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి మెదక్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.





రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ్మాతో ప్రయత్నాలు చేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ నియోజక వర్గపరిధిలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉండటంతో నీలం మధుకు సానుకూలంగా ఉండే అవకాశం ఉంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన చాగండ్ల నరేంద్రనాథ్ సైతం టికెట్ కోసం తీవ్రంగా యత్నాలు చేస్తూ పార్టీ అధిష్టానం చుట్టు ప్రదక్షిణాలు చేస్తున్నారు.

ఇద్దరు బిసి సామాజిక వర్గానికి చెందిన వారు కావటం,టికెట్ కోసం తీవ్ర స్థాయిలో కృషిచేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం సైతం అన్ని విధాలుగా సమర్థుడైన అంగ, అర్థబలం ఉన్న నాయకున్ని టికెట్ ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి, బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు లు తమ ప్రచారాన్ని ప్రారంభించారు. లోకసభ నియోజక వర్గం పరిధిలో వివిధ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నారు.

రెండుమూడు రోజుల్లో కాంగ్రెస్ టికెట్ ను ఖరారు చేసే అవకాశం ఉంది. పార్టీ అధిష్ఠానం నీలం మధు వైపు మొగ్గుచూపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్ టికెట్ ఎవరికి వరిస్తుందో తెలియాలంటే మరో రోజులు వేచి చూడాల్సిందే.!

# సాహితీ విహారి

## సద్విమర్శలతోనే సాహితీ వికాసం

సాహిత్యం ఏదైనా.. రచయిత ఎవరైనా... విమర్శలు తప్పవు. అయి తే, ఎలాంటి స్థిరమైన వాదన లేదా అంశం లేకుండా, కేవలం వ్యక్తిగత కక్షను తీర్చుకోవడానికి లేదా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించుకోవడాని కో చేసే కువిమర్శలు సరికాదు. విమర్శ సహేతుకంగా ఉండాలి. సాహితీ వికాసానికి తోడ్పడాలి. విమర్శనా పద్ధతులు ఎన్నివున్నా... భాష అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి. గొప్ప సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యుడు కట్టమంచి రామలింగా రెడ్డి. ఒక రకంగా ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు ఆయన మార్గదర్శకుడు.ఆయన రాజకీయ, సాహిత్య విమర్శ వేరువేరుగా ఉంటాయి. ఉపన్యాసాల రూపంలో ఆయన విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. అదే సమయంలో, అప్పటి వరకూ తలాతోకా లేకుండా, అరాచకంగా ఉండే విమర్శకు శాస్త్రీయత ను కల్పించారు. సామాజిక అంశాలను ఆయన లోతుగా పరిశీలించేవారు. అదే విధంగా భావనాశక్తిపైనా అంతే దృష్టి పెట్టేవారు. ఆయన విశ్లేషణలు ఓ అద్భుతం. ఆయన విమర్శలు ప్రత్యేకం. ఆధునిక భావనలతో మేళవించిన ఆయన విమర్శనా వ్యాసాలు సంచలనాలు. ఆయన ఆధునికతను సమర్థించారు. భారతీయ అలంకార శాస్త్రాన్ని వ్యతిరేకిం చి, పాశ్చాత్య సాహితీ ధోరణులను సమర్థించారు. అందుకే, ఆధునికు లు... దార్శనికులు ఆ వ్యాసాలను హర్షిస్తే, సంప్రదాయవాదులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. కట్టమంచికి సాహితీ మూలాలుగానీ, విమర్శనా విధానాలుగానీ తెలియవని విరుచుకుపడ్డారు. కానీ, ఆకాశాన్ని చూస్తూ ఉమ్మివేయడం వల్ల నష్టం ఎవరికి? ఇక సాహితీ విమర్శ అనగానే గుర్తుకొచ్చే పేర్లలో రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ ఒకటి. ఈ రంగంలో ఆయనది తిరుగులేని స్థానం. 'రసిక విమర్శ' ఆయన ప్రత్యేకత. ఆయన తన విమర్శల్లో సౌందర్యాన్ని అభిలషించి, ఆవిష్కరించి, వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. సంగీత, సాహిత్యాల్లోని సౌందర్య రహస్యాలను అన్వేషించారు. రచనల్లో వస్తు, భావ, రచనా విధానాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సాహిత్యానికి సంగీతాన్ని సమన్వయపరచిన ఘనత ఆయనకు మాత్రమే దక్కుతుంది. వివిధ రచనల్లో, ప్రత్యేకించి ప్రబంధాల్లో ఎక్కువగా కనిపించే రసికత గురించి తలచుకున్న మరుక్షణం రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ పేరు మన మస్తిష్కంలో ఆవిష్కృతమవుతుంది. నూతన విమర్శనా తీరుతెన్నులను... సిద్ధాంతాలను ప్రవేశపెట్టిన ఆయనకు ఈ విభాగంలో మొదటి తాంబూలం అందితీరాలి. కాగా, సాహిత్య విమర్శలో సమకాలీన అంశాలను, మానసిక సౌందర్యానుభవాలను విశ్లేషించడంలో అగ్రగణ్యులు కోవెల సుప్రసన్నాచార్య. ఆయన విమర్శలో దేశీయతా దృష్టి అధికం. వచనం, ఛందస్సు లక్షణాలపై అద్భుతమైన విశ్లేషణలు, విమర్శలు చేసిన గొప్ప కవి, పండితుడు కోవెల సంపత్కుమారాచార్య. సుప్రసన్నాచార్య సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇస్తే, సంపత్కుమారాచార్య ఆయా రచనలు కొనసాగిన విధానాన్ని విశ్లేషించారు. సాహిత్య విమర్శ కాలక్షేప వ్యవహారం కాదని అదొక ప్రాపంచిక దృక్పథం కలిగిన అంశమని అంటారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య. ఒక సాహితీవేత్త నిర్వహించాల్సిన సామాజిక బాధ్యతలను గుర్తించి, నిబద్ధతతో సాహిత్య విమర్శను కొనసాగించిన ఘనాపాటి ఆయన. కాగా, సాహిత్య వ్యాసాలు కొత్త కోణాలను పరిచయం చేస్తాయని, స్వతంత్ర విమర్శకు అవి నిదర్శమని దువ్వూరి రామిరెడ్డి అభిప్రాయం. ఆయన విమర్శలు ఈ కోణంలోనే కొనసాగుతాయి. కవిత్వ తత్వాన్ని, సౌందర్య తత్వాన్ని తన విమర్శల్లో భాగంగా చేసుకొని, సాహిత్య విమర్శలో అద్భుతాలు సాధించిన దువ్వూరి ఎంతో మందికి మార్గదర్శకుడయ్యారు. కాగా, చరిత్రక ప్రమాణాలను ఆధారంగా చేసుకొని, సాహిత్య విమర్శలు చేసిన ప్రముఖుడిగా నోరి నరసింహ శాస్త్రి నిలుస్తారు. ఆయన విమర్శలు సైద్ధాంతికగానూ, సంపూర్ణమైన అధ్యయమ మూలాలుగానూ గోచరిస్తాయి. 'మహోదయం' రాసిన కెవి రమణారెడ్డిని సాహిత్య విమర్శను శాస్త్రీయంగా నిర్వహించిన అద్భుత పరిశోధకుడిగా పేర్కొంటారు. కవి జీవిత సాహిత్య విమర్శకు 'మహోదయం' ఒక కవి జీవిత సాహిత్య విమర్శకు నిదర్శనంగా నిలుస్తుంది. తెలుగు సాహిత్య విమర్శకుల్లో శాస్త్రీయపరంగా ఆ ప్రక్రియను మరెవరూ కొనసాగించలేదని అంటా రు. స్వతఃగా వామపక్ష భావాలున్న కెవి రమణారెడ్డి విమర్శల్లో తర్కం గోచరిస్తుంది. మార్క్సిస్టు తాత్విక భూమికతో ఆయన అనువర్తిత విమర్శలను సమర్థంగా నిర్వహించారు. సామాజిక శాస్త్రాలను విస్తృతంగా చదువుకున్న ఆయన, ఏ కాలం నాటి రచనలైనా అద్భుతంగా సమీక్షించేవారు. రచనలు ఎప్పటివైనా, విమర్శించడంలో తప్పులేదని నమ్మారు. రస వివేచన, ప్రభావ పరిశీలన, ప్రతీక విశ్లేషణ, ప్రక్రియ పరిణామ పరిశీలన, నవ్య సంప్రదాయ కవిత్వోద్యమ దర్శనం, నూతన అంశ ప్రతిపాదన దిశగా జివి సుబ్రహ్మణ్యం విమర్శలు దర్శనమిస్తాయి. నవలా విమర్శను విస్తృతపరచి, ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన విమర్శకురాలు డాక్టర్ సి. ఆనందరామం. వృత్తిరీత్యా లెక్చరర్ కావడంతో, ఆమె రాసిన నవలలే కాదు. .. విమర్శనా వ్యాసాలు కూడా వినూత్న గమనాలతో ఆకట్టుకుంటాయి. బుచ్చిబాబు రచన 'చివరికి మిగిలేది' నవలను ఆనందరామం మాదిరి మరెవరూ విశ్లేషించలేరనడం అతిశయోక్తి కానేకాదు. విమర్శన లోతుల్ని అధ్యయనం చేయాలంటే, ఆనందరామం వ్యాసాలు చదివితీరాలి.


కట్టమంచి రామలింగారెడ్డి


రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ


నోరి నరసింహ శాస్త్రి


దువ్వూరి రామిరెడ్డి

లెక్కకు మించిన సాహిత్య విమర్శలు ఉన్నప్పటికీ, కొద్ది మందిని మాత్రమే ఎందుకు గుర్తుంచుకుంటారు అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం కూడా ఉంది. దురదృష్టం ఏమిటంటే, చాలా మందికి విమర్శ, సమీక్షకు మధ్య తేడా తెలియదు. అంతేకాదు, విమర్శ చేసిన వాడికి లేని ఉద్దేశాలు ఆపాదించడం తెలుగు సాహితీ రంగంలోనే ఎక్కువ. అజ్ఞానం, ఆత్మవ్యామోహం కారణంగా సద్విమర్శలు తగ్గిపోతున్నాయి. సుప్రసిద్ధ రచయిత జాన్ బాన్‌విల్లే చెప్పినట్టు విమర్శ, సమీక్ష ఒకటి కాదు. విమర్శకుడు చేసే పని వేరు. సమీక్షకుడు చేసే పని వేరు. పాఠకులకు పుస్తకాన్ని పరిచయం చేయడం వరకే సమీక్షకుని బాధ్యత. ఒక రచనకు తగు స్థానం కల్పించడం అనేది ఒక విమర్శకుడు మాత్రమే చేయగలడు. ఒక పుస్తకం చదివిన తర్వాత, మనలో కదిలే తొలి ఆలోచనలకు అక్షర రూపమే సమీక్ష. అందుకే, సమీక్షలను కొంతకాలం తర్వాత, రాసిన వారే తిరిగి చదివితే పేలవంగా కనిపించవచ్చు. ఒక్కోసారి అసలు నచ్చకపోవచ్చు. సమీక్షల్లో సదరు రచనకు సంబంధించిన అంశాలు, అవి మనకు కలిగించిన అనుభూతులు, అభిప్రాయాలను మాత్రమే పొందుపరచగలం. అదే రచనను క్షుణ్ణంగా చదివి, సమీక్షించి, వివిధ అంశాలతో జతపరచి, ఒక అధ్యయనంగా అక్షరబద్ధం చేయడాన్ని మాత్రమే విమర్శ అంటారు. సమీక్ష తక్షణ భావాలను ప్రతిబింబిస్తుంది.

విమర్శ దూరదృష్టిని ప్రసాదిస్తుంది. తెలుగులో ఇటీవల సమీక్షలే ఎక్కువగా వస్తున్నాయి. వాటిని విమర్శలుగా భ్రమపడకూడదు. విమర్శకులపై రచయితలు పెద్దఎత్తున ఎదురుదాడి చేయడం కూడా చాలా మందిని సమీక్షలకే పరిమితం చేస్తున్నది. ఒక విమర్శ ఎలా ఉండాలో తెలియాలంటే, కొడవటిగంటి కుటుంబరావును చదవాలి. సాహిత్య విమర్శలు ప్రయోజనకరకంగానూ, అభ్యుదయ పంథాలోనూ ఉండాలన్నది ఆయన వాదన. విజ్ఞాన శాస్త్రాన్ని, మార్క్సిజాన్ని ఆధారంగా చేసుకొని విమర్శలు కొనసాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీశ్రీ, గుంటూరు శేషేంద్ర శర్మ, ఆర్ఎస్ సుదర్శనం, కుందుర్తి ఆంజనేయులు, కెకె రంగనాథాచార్యులు, ముదిగొండ వీరభద్రయ్య వంటి ఎంతోమంది ప్రముఖుల ఆలోచనలు, రచనలు, వాస్తవ సాహితీ విమర్శకు మార్గం చూపుతాయి. మనం గుర్తించాల్సింది, అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, వివేచన, రసహృదయం ఉన్న ప్రతి ఒక్కడు విమర్శకుడైపోడు. ఒక రచయిత లేదా కవి తీసుకున్న వస్తువుకు.. ఉపయోగించిన భాషకు... భావాన్ని స్పష్టంగా తెలిపేందుకు చేసిన ప్రయత్నానికి ప్రాధాన్యం ఇవ్వకుండా, హడావుడిగా.. ఏదో ఒకటి చెప్పడం విమర్శ అనిపించుకోదు. పుస్తకాల పురుగులు... పండితులు.. విజ్ఞానంతులు అయినంత మాత్రాన గొప్ప విమర్శకులవుతారని అనుకోవడం తప్పు. నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించే నిజాయితీ, స్వపర భేదాలు లేకుండా, నిష్కల్మష ప్రవర్తన ఉన్నవారే నిజమైన విమర్శ చేయగలుగుతారు. నిజమైన విమర్శకులు సాహిత్యానికి కట్టుబడి ఉంటారు. నిజాయితీ లేనివారు రచయితలుగానే పనికిరారు. ఇక మంచి విమర్శకులు కావడం అసాధ్యం. అందుకే, నేడు తెలుగులో సాహిత్యం వెలువడినంతగా ఆ సాహిత్యంపై విమర్శ రావడం లేదు. ముఖ్యంగా గత రెండు దశాబ్దాలుగా విమర్శనా ప్రక్రియ సన్నగిల్లింది. ఒకటిన్నర శతాబ్దికాలంగా అనేక ఉద్యమాలకు, భావజాలాలకు ప్రేరణగా ఆధునిక తెలుగు సాహిత్యం, సరైన విమర్శలు లేక గతి తప్పుతున్నది. అరకొరగా విమర్శలు వస్తున్నప్పటికీ, అవి శాస్త్రీయంగా, గుణాత్మకంగా లేవన్న అసంతృప్తి చాలా మందిలో ఉంది. సాహితీ విమర్శలో ఒక స్పష్టత, ఒక సూత్రబద్ధత, సరైన ప్రామాణికత ఉండాలి. నిజానికి, ఒక రచన యొక్క వైశిష్ట్యాన్ని సాహితీ లోకానికి పరిచయం చేయాల్సిన గురుతర బాధ్యత విమర్శకునిపై ఉంది. రచనల్లోని అభ్యుదయ అంశాలతోపాటు లోపాలను కూడా విమర్శకుడు ప్రస్తావించగలగాలి. అంటే, ముందుగా విమర్శకుడికే వివిధ రంగాలు, సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులపై అవగాహన ఉండాలి. రచయిత మనసులోకి తొంగిచూసే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పుడే, కవి హృదయం తెలుస్తుంది. అప్పుడే, నిజమైన అధ్యయనం, సమీక్ష సాధ్యమవుతాయి. అయితే, ఇటీవల కాలంలో తెలుగు సాహిత్య విమర్శ కేవలం ప్రశంసలకు మాత్రమే పరిమితం అవుతున్నది. విమర్శ పాఠకుని జిజ్ఞాసను రేకెత్తించాలనే ఆలోచన లేకుండా పోతున్నది. కవిత్వం లేదా రచనలోని సొగసుల్ని, శిల్పాన్ని పాఠకునికి పరిచయం చేసే ప్రయత్నం విమర్శకుల నుంచి రావాలి. మరింత లోతుగా పఠించి సాహిత్య సౌందర్యాన్ని ఆస్వాదించాలనే జిజ్ఞాసను కలిగించాలి. దురదృష్టవశాత్తు ప్రస్తుతం వెలువడుతున్న విమర్శలో అత్యధిక భాగం చేస్తున్న చర్చకి పరిమితమై శిల్పాన్ని పట్టించుకోని తీరు కన్పిస్తుంది.

**సత్యశ్రీ**

## ఆంగ్లంలో బాలసాహిత్యం...

ఇంగ్లాండ్‌లో బాలల సాహిత్యం థామస్ బోర్మాన్, జాన్ న్యూబెరీ వంటి వ్యాపారుల ద్వారా మొదలైంది. 1742లో బోర్మాన్ స్వీడిష్ జెయింట్ కాజనస్‌ను నిర్మించాడు. 1744లో న్యూబెరీ ఎ లిటిల్ ప్రెట్టీ పాకెట్‌బుక్‌ను ప్రచురించాడు. పిల్లలకు విద్యాపరమైన అంశాలను అందించే ఉద్దేశ్యంతో కాకుండా వారి మనోవికాసానికి, ప్రపంచంలోని ఎన్నో అంశాలను పరిచయడం చేయడానికి ఈ రచనలు దోహదపడ్డాయి. ఆంగ్లంలో బాల సాహిత్యం దాదాపు అప్పుడే మొదలైందని చెప్పుకోవాలి. జాన్ న్యూబెరీని బాల సాహిత్య పితామహుడు అని పిలుస్తారు. దాదాపు రెండు వందల పిల్లల పుస్తకాలను ప్రచురించిన ఈ రచయిత, అతను పిల్లలకు వారి స్వంత కథలు లేవని గ్రహించాడు. ఆ లోపాన్ని తీర్చడానికి ప్రయత్నించిన మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు. బాల సాహిత్యంలో సరళత, స్వచ్ఛత, సార్వత్రిక ఇతివృత్తాలు, ఊహాజనిత కథనాలు ఎక్కువగా ఉంటా యి. నిజానికి వయస్సు సరిహద్దులను అధిగమించే విస్తృత ఆకర్షణ ఈ పుస్తకాలకు లేదా రచనలకు ఉంటుంది. స్ఫూర్తిదాయకమైన భవిష్యత్తుకు పునాదులు వేసే శక్తి బాలసాహిత్యానికి ఉంటుంది. ఎంతటి క్లిష్టమైన అంశాన్నయినా సులభంగానూ, సంక్షిప్తంగానూ అందించే బాల సాహిత్యాన్ని పెద్దలు కూడా చదువుతారన్నది బహిరంగ రహస్యం. వయసుతో సంబంధం లేకుండా పాఠకులు ఆయా పుస్తకాల్లోని ప్రధాన పాత్రల్లో తమను తాము ఊహించుకోవడం నిజం. బాల సాహిత్యం అనేది విద్యార్థులకు చదవడం, రాయడం ఎలాగో నేర్పడానికి మాత్రమే కాకుండా వారి భాష, భావోద్వేగాలు, అభిజ్ఞా నైపుణ్యాలను పెంచడాని కి కూడా సహాయపడుతుంది. సమస్యల పరిష్కారంతో పాటు విమర్శనాత్మకంగా, సృజనాత్మకంగా ఆలోచించే గుణం, మరింత నైపుణ్యం పిల్లల్లో పెరుగుతుంది. వారి మనో వికాసానికి బాటలు వేస్తుంది. కొన్ని పిల్లల పుస్తకాలు ఎలాంటి ఆసక్తిని రేపకుండా, అత్యంత సాధారణంగానూ, 'ఒక డైమెన్షనల్'గానూ ఉండవచ్చు. కానీ, నాణ్యమైన పిల్లల పుస్తకం అందరి దృష్టిని అనేక విధాలుగా ఆకట్టుకునేలా ఉంటుంది. భాషను సృజనాత్మకంగా వినియోగించడం, ఆకర్షణీయమైన పాత్రలు కల్పించడం, కథాంశం లేదా దృష్టాంతాలను సమర్థవంతంగా ఉపయోగించ డం ద్వారా ఈ రచనలను మరింత ఆకర్షణీయంగా మలచవచ్చు.

## సామూహిక పండుగ...హెూలీ...రంగులకేళీ

భారతదేశంలో హిందువులు అత్యంత ఉత్సాహాలతో, సంబరాలతో సామూహికంగా జరుపుకునే ప్రాచీన పండుగ హోలీ. ఈ పండుగకు పురాణేతిహాసాల్లో అత్యంత ప్రాధాన్యం ఉండడంతో రంగుల పండుగగా పవిత్రంగా జరుపుకుంటారు. ఇది ఉత్తరభారతదేశం నుంచి వచ్చినదిగా చెబుతారు.

**'హెూలీకేళీపై....వివిధ కథనాలు :** శ్రీకృష్ణుడు, రాధ, గోపికల రసరయ్యకేళీ నుంచి హెూలీ పండుగ పుట్టిందని ఉత్తరభారతీయులు ముఖ్యంగా శ్రీకృష్ణుడు జన్మించిన నందగావ్ (మధుర) రాధ జన్మించిన బర్సానా ప్రాంతీయులు చెబుతారు. ఈ పండుగను ఆప్రాంతంలోని మధుర, బృందావనం, బ్రజ్, బర్సానా, నందగావ్ తదితర ప్రాంతాల్లో 16 రోజుల పాటు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారు.

**వేసవి ఆరంభంలో:** చలికాలం వెళ్ళి వేసవి ఆరంభంలో వసంతరుతువుకు స్వాగతం పలికే పండుగ హెూలీ. అప్పటి ప్రకృతిలోని అన్ని రకాల పూలచెట్లు విరగబూసి నూతనోత్తేజంతో కళకళలాడుతాయి. సుగంధ పరిమళాలు వెదజల్లుతూ జీవకోటికి హాయిని ఆనందాన్ని కలిగిస్తాయి. ఈ పులకిత కాలాన్ని ఆస్వాదిస్తూ వివిధ వర్ణకుసుమ ప్రకృతికి ప్రతీకగా రంగుల హెూలీని జరుపుకుంటూ ప్రకృతిని ఆరాధించడాన్నీ భాగంగా చేశారు. అందుకే ఈ పండుగను పాల్గుణోత్సవం, వసంతోత్సవం, కాముని పండుగ ఇంకా వివిధ పేర్లతో పిలుస్తున్నా రు.

**రోగాలనియంత్రణకు :** జ్వరాలూ, జలుబులు, ఇతర రోగాలు రాకుండా వేప, బిల్వ, అగ్ని పూలు వంటి ఔషధగుణాలున్న, ఆకులూ, పువ్వుల పొడులూ, పసుపు, కుంకుమలు నీళ్లలో కలిపి తయారుచేసిన రంగులను ఒకరినొకరు చల్లుకునే వ్యవహారం నుండి హెూలీ పండుగ వచ్చిందనీ ఆయుర్వేదవైద్యులు చెబుతారు. కాగా మోదుగు పూలను నీటిలో మరిగించి తయారు చేసిన రంగులను చల్లుకొని హెూలీ జరుపుకోవడం ఆరోగ్యంగా ఉంటుందని చెబుతారు. కాని రసాయనాలు కలిసిన రంగులను, కాలిన మోటార్ల ఆయిల్‌నూ, కోడిగుడ్ల నూ, ఇంకా ఆరోగ్యానికి హానిచేసే వివిధ రంగులను పూసుకుంటూ అనారోగ్యానికి గురికావడమే కాకుండా హెూలీని అవహేళన చేస్తున్నారు. ధనిక, పేద, చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే సామూహిక పండుగ ఇది. కామదహనం అంటే కోరికలను దహించివేయటం, దుర్మార్గాన్ని ఆహుతి చేయడం అనే సామాజిక సందేశం ఇస్తుంది ఈ పండుగ.

**తాళ్ళపల్లి యాదగిరి గౌడ్,** 9949789939

పుస్తక సమీక్ష

## హృదయాన్ని హత్తుకునే 'బడిబువ్వ కథలు'

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బాలసాహితీవేత్తలందరికీ సుపరిచితమైన పేరు గరిపెల్లి అశోక్. ఉపాధ్యాయుడిగా పనిచేసి విశ్రాంత జీవితం గడుపుతున్న, బాలసాహిత్యాభివృద్ధి కొరకు అవిశ్రాంతంగా పనిచేస్తున్న బాలల ప్రేమికుడు, బాల సాహితీవేత్తలకు మార్గదర్శి గరిపెల్లి అశోక్. తను విద్యార్థుల కొరకు కథలు రాయడమే కాకుండా, పిల్లలకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు బాలసాహిత్య సమాచారం అందిస్తూ వారు రచనలు చేయడానికి ప్రోత్సాహాన్ని అందిస్తూంటారు. ఉపాధ్యాయుడిగా తనకున్న అనుభవాలు, జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ 'బడిబువ్వ' కతల పుస్తకంతో మరోమారు మనముందుకొచ్చారు గరిపెల్లి అశోక్.




పద్మావతి అనే తొమ్మిదో తరగతి అమ్మాయి ఈ బడి బువ్వ కథల్లో ప్రధాన పాత్రగా మనకు కనబడుతుంది. పద్మను అందరూ ముద్దగా పెద్దక్కగా పిలుస్తారు. ఇతరులకు ఏ ఆపద వచ్చిన పెద్దక్క నిస్వార్థంగా సాయం చేస్తుంటుంది. పైగా వారినుండి ఏమి ఆశించదు కూడా. అలాంటి పెద్దక్కను చూసి నేటితరం పిల్లలు నేర్చుకోవలసిన ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. ప్రతి విషయంలో పెద్దక్క చూపే ధైర్యం, తెగువ, ఆలోచన మనకు ముచ్చటగొలుపుతాయి. మంచి పనులు చేయుటకు ఎప్పుడు ముందు ఉంటుంది. ఒకరి ఆనందమే తన ఆనందం, పరుల సంతోషమే తన సంతోషం అని భావించేది పద్దు. బడిబువ్వ పుస్తకంలో మొత్తం పది కథలు ఉన్నాయి. అవన్నీ బడి నేపథ్యంగా కొనసాగినవే. అనునిత్యం మన చుట్టూ జరిగే సంఘటనలే. ఇందులో ఉన్న కథల పేర్లు కూడా సహజత్వానికి చాలా దగ్గరగా ఉన్నా యి. ఇందులో ఏ కథ చదివినా పాఠకుడు ఆ కథలో పూర్తిగా లీనమైపోతాడు. బడి ని కూడా తన ఇంటిలాగ చూసుకునేది పెద్దక్క. ఆటపాటల్లో, చదువు సంధ్యలో, వినయ విధేయతల్లో, తెలివి తేటల్లో పెద్దక్కకు సాటివచ్చేవారు ఎవరు లేరు. ఇలాంటి అమ్మాయి మన ఇంట్లో కూడా ఉంటే ఎంత బాగుండు అనిపిస్తుంది.

బడిబువ్వ కథలు జీవిత వాస్తవికతకు దగ్గరగా ఉన్నాయి. ఎంతో మంది పేద ప్రజల పిల్లల ఆకలి తీర్చేది బడిబువ్వ. ఎంత కష్టమైన పిల్లలను బాగా చదివిస్తే వారు తమలా కాయకష్టం చేయకుండా సుఖంగా జీవిస్తారనే నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపిస్తారు. అందులో ప్రభుత్వ బడికి వచ్చే వారు చాలా నిరుపేద పిల్లలు. వారు ఖాళీ కడుపులతోనే బడికి వస్తారు. అలాంటి పిల్లలకు మధ్యాహ్నం భోజనంతో కడుపు నింపేది బడి బువ్వ. మధ్యాహ్నం తాను తినవలసిన అన్నాన్ని ఆకలితో అల్లాడుతున్న వృద్ధ దంపతుల కు పెట్టి అన్నపూర్ణగా నిలిచింది పెద్దక్క. పదిమంది గురించి ఆలోచించడం, అన్నదానం చేయడం, మానవ సంబంధాలు, చెట్ల పెంపకం, పరోపకారం, నిజాయితీ మొదలగు విషయాలు ఈ ఒక్క బడి బువ్వ అనే కథలో మనకు గోచరిస్తాయి. తొక్కు రాసిన మక్క రొట్టె కథలో కవిత షర్టుకు గుండీలు ఊడిపోతే తన షర్ట్ గుండీలు కోసి ఇచ్చి తాను మాత్రం కాంటాలు పెట్టుకొని బడికి వెళ్లిన త్యాగశీల గుణం కలది పద్మావతి. 'అమ్మా! అందరూ పిల్లలు ఇంటర్వెల్‌లో బఠానీలు, సెనగలు, బెబ్బర్లు ఇంకా ఏమేమో కొనుక్క తింటరమ్మ, నాకు కూడా అప్పుడప్పుడు తినబుద్ధయితదమ్మ, పైసలు లేవని అందుకే వాళ్లకు దూరంగా ఉంటానమ్మా. మక్క రొట్టె తీసుకపోవన్నా?' అని పద్దు వాళ్ళ అమ్మను అడుగుతుంది. దీనిని బట్టి పద్దుకు చిన్నప్పుడే తన కుటుంబ పరిస్థితులను ఎంత ఆకళింపు చేసుకుందో అర్థం అవుతుంది. అమ్మను బాధ పెట్టకూడదని బాధ్యతగా మసులుకుంది. ఇలా ఇందులో ఉన్న ప్రతి కథ సందేశాత్మకంగా ఉండటమే కాకుండా అది మన చుట్టూ ఎక్కడో ఒక చోట జరిగినట్టే అనిపిస్తుంది.

బడిబువ్వలో ఉన్న కథలన్నీ హృదయాలను కదిలించేవే. ప్రతి కథ కూడా ఆలోజింపజేసే విధంగా, పదిమంది ఆచరించే విధంగా ఉంది. రచయితకు కావలసినది సామాజిక మా ర్పు. ఆ మార్పు ఈ కథలు చదివాక ఎవరి మనసులోనైన కలుగుతుంది. ఇగ రచయితకు ఇంత కంటే ఏం కావాలి.

**ప్రతులకు..**గరిపెల్లి సరోజన, 9849649101.

**కందుకూరి భాస్కర్,**
9703487088.

## ఈ వారం కవితలు

### హోలీ..రంగుల కేళి



సమైక్య జీవన సందేశం
దేశ సంస్కృతి సంకేతం
భక్తి విశ్వాస సమ్మేళనం
రంగుల హోలీ ఉత్సవం

ఫాల్గుణ పౌర్ణమి శుభవేళా
హరివిల్లు ఇలపై విరిసినట్లు
వర్ణజల్లు నేలపై కురిసినట్లు
ప్రకృతి శోభగం వన్నెలీనట్లు
జగతి వసంతం అరివిరిసేను

సప్తర్ణోత్సవ సమయాన
సకల జనావళికి సమిక్యమై
ఏడురంగులు చల్లుకుంటూ
ఆత్మీయ గంగలో మునకేసేను
ప్రేమక గగనంలో విహరించేను

డోలీకోత్సవ తరుణాన
ఆబాల గోపాలం మమేకమై
చిద్విలసిస్తూ చిందులువేస్తూ
ఆనంద ఉయ్యాలలో ఊగేను
ఆహ్లాదాల జగతిలో ఊరేగేను

రంగుల పర్వపు క్షణాల
బంధుమిత్రుల హాసాలు
ఆటపాటల కేరింతలతో
ఊరంతా ఉత్సవ సందళ్లు
జగమంతా ఉల్లాస సవ్వళ్లు

ఈ సుభమంగళకర వేళా
సకల జనావళి సమైక్యమై
సంతోషంగా జరుపుకుందాం
సంస్కృతి సాంప్రదాయ ప్రశస్తి
విశ్వ జగతి ఎల్లెడలా చాటుదాం

(నేడు హోలీ మహోత్సవం సందర్భంగా)

**కోడిగూటి తిరుపతి**
9573929493

### జైలు వారికి విడిది...

జైలుకు వెళ్లడం నీకు నాకూ నామోషీ
నాయకులకు మాత్రం అది ఒక విడిది
కవులకు కష్టం బెయిలు కాని అది
పదవి వున్న వాళ్లకు వెతుక్కుంటూ వస్తుంది

పరువు గిరువు పేద వాడికి గానీ
పబ్లిసిటీ ఫ్రీ అని తొడలు కొడతారు వారు
చంచల్ గూడ వాస్తు బాగున్నట్లు వుంది
సిఎం పదవి చాటలో పెట్టి వస్తుంది
చేతి వాటానికి బేడీలు వేస్తారు కాని
స్కామ్ చేసిన వారిని విమానంలో ఎక్కించుకుని
నీకు నాకూ థర్డ్ డిగ్రీ నరకం చుక్కలు
పెద్ద వాళ్లకు గంట గంట కు బిపి చెక్ చేస్తారు

నిన్ను ఎక్కడ దాచి పెట్టినారో
ఏ క్షణమైనా ఎన్‌కౌంటర్ వార్త రావచ్చు

నాయకులకు రిమాండ్‌లో మాసాజ్ సేవలు
బంధువులు కార్యకర్తలు రావచ్చు పోవచ్చు
నీకు నాకూ పేరోల్ కోసం మొక్కులు
పిల్లలను చూడాలని ఎదురు చూపులు
కరెన్సీ వున్న వాళ్లకు మంచి రోగాలు వస్తాయి
ఆరోగ్యం కోసం అనుకున్న చోటుకు అనుమతులు

నీకు నాకూ చట్టాలు సెక్షన్ లు కాని
బతిమిలాడడం దేవుడి మీద భారం
నాయకులకు వెసులుబాటు మార్గాలు
నల్ల కోటులు వాదించి అనుచరులు సన్మానంలు

రాజ్యాంగం పక్షపాతం అవునో కాదో
న్యాయం మాత్రం నాయకులకు అందుబాటులో
సామాన్యుడు సెక్షన్‌ల వుచ్చులో విలవిల
వకీలు వాయిదాలతోనే సరిపెట్టి సీరియల్ లా...

**దాసరి మోహన్**
9985409090

### ప్రశ్నిస్తున్నా?

ఆడపిల్లనైతే ఆమడ
దూరం పోతానని అలుసా..
నీ విలాగే ఉండాలి
నీవు ఎలాగైనా ఉండొచ్చు
ఇదేంటి ఈ ద్వంద వైఖరి

నిర్మాణం నిర్దేశం
నడక నాణ్యత
నాయకత్వం నాలో లేవా..?
చరిత్రపుటల్లోనూ నిక్షిప్తం
అవలేదా..?
వెలివేయబడి వెనకబడి

రుణసంకేతంగా నన్నెందుకు
మార్చారు?
ఏ చరిత్ర గతిలో
తిరగబడింది నా చరిత్ర ?

కొరివితోనే మోక్షం అయితేనే
పట్టలేనా?పెట్టలేనా? తోడు
నీడ నేను అవ్వలేనా.!?

ఆశా శ్వాస దశ దిశలా
బాటలా బాసట నాకు ఇవ్వండి ..
నేను ఎదుగుతా వికసిస్తా

ప్రకాశిస్తా!
ప్రపంచానికి విలువల
వెలుగులు పంచుతా
పునాదిలోనే పుట్టుక్కుమనిపించి.
సమాజ నిర్మాణ
సౌధాలను కూల్చేస్తూ ఏం
సాధిస్తారు? మారండి ..
మమ్మల్ని ఎదగనివ్వండి..
పక్షపాతం వదిలి
సమభావం చూపండి...
ఆకాశమే హద్దుగా
వేగు చుక్కలమై వెలుగుతాము

**గడ్డం సులోచన**
7702891559

### నీవే నీవే...భావి నిర్మాత

ఎక్కడ చూసినా
దౌర్జన్య రక్కసి కరాళ నృత్యాలే.
యుగమేదైనా,కాలమేదైనా
దుష్టత్వం,నీచత్వం
ఏదో ఒక రూపంలో చిరంజీవులే.

ఓ మనిషీ!
ఆకలి,ఆవేదనలకు
హింసాద్వేషాలకు తావేలేని
సమాజం కావాలన్న నీ ఆశలు
ఆకుల్లా రాలిపోతోంటే,
ఎడారిలో బాటసారిలా ఒంటరినైపోతున్నా
నని చింతించక,
కనుల కొలనులో
కలల తామరలు వికసింపచేసే
ఆత్మవిశ్వాసపు భానుడవై
ఉద్యమించు.
వంధిమాగత్వం మాని

అన్యాయాన్ని గొంతు పెంచి ప్రశ్నించు.
దౌర్జన్యాన్ని
ఎదురు నిలిచి తుంచేస్తేనే,
రానున్న తరాల్లో
ఆనంద వీచికలు వీస్తాయి.
మనం రుచి చూస్తున్న
స్వేచ్ఛా ఫలాలు
ఎవరో ఒకరు తిరగబడితేనే
దొరికినవని గుర్తెరుగు.

ఎన్ని ఉప్పెనలు ముంచెత్తినా
కరిగిపోని కఠినశిలను సైతం
కరిగించగల సత్తా నీ 'ఓటు'కుంది.
త్వరపడు...
దాన్ని సక్రమంగా వినియోగించి
విలువలున్న సమాజాన్ని నిర్మించు.
నీ నిర్ణయమే శాసనం
ఫలితమే సమాజ మలుపు.

**వేమూరి శ్రీనివాస్**
9912128967

### కవిత్వమొక తీరని దాహం!

అక్షరాల్ని సృజనాత్మకతలో ముంచి
వెలిగిస్తే కవితాదీపమై కాంతులీనుతాయి
కవిత్వాన్ని ఆకాశంలాంటి తెల్లకాగితంపై
గాలిపటంలా సంధిస్తే రెపరెపల భావార్థాలతో
విశ్వవీధుల్లో గజ్జెకట్టి ఆడతాయి
అక్షరాలకు ఆశయాల పదును పెట్టి
ఎక్కడ నాటితే అక్కడ కవిత్వమై
మొలకెత్తి పచ్చగా అల్లుకొని గుభాళిస్తాయి
గతంలో ఎందరో అక్షరశిల్పులు ఎన్నో
సామాజికశిలల గుణదోషాలెరిగి నవీన
కవితా సృష్టికి నాంది పలికారు
మహాఋషుల్లా మనసనే ఉలికి పదును
పెడుతూ అపూర్వ కవితాసంపద జాతికి
వరంగా అందించేరు..
ఆ కవితాశిల్పాలు నేటికీ ఏనాటికీ
అజరామరమై అలరారుతూ జనుల
మనుగడకు జవజీవాలై నిల్చిపోయేయి
ఇక్కడ అక్షరం ఒక్కటే!

అది పలు అనుభూతుల రూపాలు ధరించి
కవి చేతిలో కవితాత్మకమై తరించింది..
నాడు ప్రబంధ బంధాల్లో బంధీకృతమై
భావావేశాన్ని అణుచుకోలేక తొణికిసలాడి
అభ్యుదయంతో సరికొత్తగా ఉదయించి
కడకు విప్లవమై రగిలి ఆకలేసి కేకలేసి
నేడు ఆధునికమైన భావాత్మకతతో వెలుగుతూ
రవి కాంచని చోటల్లా నవ్య భాషా జిలుగులు
అద్దుకొని అప్రతిహతంగా ప్రవహిస్తోంది
పల్లవిస్తోంది..!!

**భీమవరపు పురుషోత్తమ్**
9949800253

### స్వర్గ రేఖలు

ఇది జీవుల వింత దుర్గం
బోనుల స్వేచ్ఛా సంతల మార్గం
ఒకరి ఊహ ఒకరికి వింత
భ్రమలలో బ్రతుకుల చింత!
నాటకాలు చిత్రాలు శిల్పాలు
కావ్యాలు కథలు కాల్పనికాలు
ఆధునిక దూరదర్శనాలు!
కలగూర గంప ఈ జీవుల కొంప
మాటలు నేర్చిన మనిషికి మాయలు ఎందుకో!
మాటలు రాని జీవులు అమాయకము ఎందుకో!
కనిపించని మనసులో

కానరాని ఆవేదనలు ఎందుకో!
కలలుగనే జీవుల కనురెప్పలలో
స్వప్న రేఖలు ఎన్నో!
చెదరని ఆ మధుర స్వప్నంలో
కనిపించే వెలుగు రేఖలు ఎన్నో!
వింత లోకంలో ఊహల స్వర్గ రేఖలు ఎన్నో!
కళ్ళు మూసినా తెరిచినా
కలల తపనల తలపులు ఎన్నో!
కలత నిద్దురలో కలవర పెట్టే కలల కథలు ఎన్నో!
ఆరాటపడే గుండెలకు
సాకారం అయ్యే స్వర్గ రేఖలు ఎన్నో!

**పి.బక్కారెడ్డి,** 9705315250

## రాష్ట్ర ప్రజలకు సిఎం హోలీ శుభాకాంక్షలు

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే హోలీ రంగుల పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సహజ సిద్ధమైన రంగులతో సాంప్రదాయ పద్ధతులతో రంగుల పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా పాలనలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి ఫలాలు అందరి కుటుంబాల్లో సప్తవర్ణ రంగుల శోభను నింపుతాయని అభిప్రాయపడ్డారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సమైక్యతను చాటిచెప్పే ఈ పండుగ దేశమంతటా కొత్త మార్పునకు శ్రీకారం చుడుతుందని అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా త్వరలోనే దేశంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే కొత్త ప్రజాస్వామ్య వాతావరణం వెల్లివిరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## దర్యాప్తు సంస్థలూ ఇసి పరిధిలో ఉండాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సమయంలో పరిపాలన, పోలీసు యంత్రాంగం తరహాలోనే సిబిఐ, ఇడి, ఆదాయపన్ను శాఖ కూడా ఎన్నికల సంఘం పరిధిలో తీసుకురావాలని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ కోరారు. ఈ మేరకు ప్రధాని ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఆయన ఆదివారం లేఖ రాశారు. ఇడి,సిబిఐ, ఆదాయపన్ను శాఖలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులను వేధింపులకు గురిచేస్తోందని, ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తోంది, ఎప్పటివో పాత కేసులను ఇప్పుడు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల నిజమైన అభీష్టాన్ని ప్రతిబింబించేలా ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, న్యాయంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలు సమయంలో ఆదాయపన్ను శాఖ,సిబిఐ, ఇడి దర్యాప్తు సంస్థలు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకునేలా ఉండాలన్నారు.

# హోలీ ముందస్తు సంబురాలు







**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు హోలీ వేడుకలు సందడిగా సాగాయి. వీకెండ్ కావడంతో హైదరాబాద్‌లో ప్రత్యేక ఈవెంట్స్‌లు నిర్వహించారు. విద్యార్థులు, స్నేహితులంతా ఒక చోట చేరి ముందస్తూ సంబురాలు నిర్వహించారు. హైదరాబాద్ మోడల్స్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని హెచ్ఎండిఎ ప్లే గ్రౌండ్‌లో 'కంట్రీ క్లబ్ హోలీ' పేరుతో వేడుకలు నిర్వహించారు. సేంద్రీయ రంగులతో ఐదు గంటల పాటు సాగిన 'కంట్రీ క్లబ్ హోలీ' సంబరాల్లో యువత పెద్ద సంఖ్యల్లో పాల్గొని జోష్‌గా రెయిన్ డాన్స్‌లు చేశారు. మ్యూజిక్ మస్తీలో ఉర్రూతలూగారు. ఆత్మీయులంతా ఒకరికొకరు రంగులు పూసుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు జిల్లాల్లో యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ జరుపుకున్నారు. ఖమ్మంలో ముందస్తు హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. ఓ ప్రైవేటు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు సమీపంలోని గాయత్రి గ్రౌండ్స్‌లో వేడుకలు నిర్వహించారు. ఖమ్మం నగరానికి చెందిన యువత భారీ సంఖ్యలో హాజరయ్యారు. పాండిచ్చేరి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన డిజెల సంగీత శబ్ధాలతో ఉర్రూతలూగించించారు. నీటి జల్లులు ఏర్పాటు చేయడంతో డ్యాన్స్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. రంగులు చల్లుకుంటూ కేరింతలు కోడుతూ ఆనందంగా గడిపారు. ఖమ్మం నగరంలో తొలిసారిగా ఇటువంటి ఈవెంట్ ఏర్పాటు చేయడం పట్ల యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్ లో గార్డెన్ గ్యాలరీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బిజెపి హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవిలత పాల్గొన్నారు. ఈ వేడుకల్లో రాజస్థానీ, మార్వాడీ కుటుంబాలు పాల్గొని ఉత్సాహంగా, సందడిగా ఒకరికొకరు రంగులు పూసుకోని నృత్యాలు చేస్తూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని మాధవిలత అన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను మహేశ్వరీ సమాజ్ కాపాడుకుంటూ, ముందుకు తీసుకెళ్తుందన్నారు. హోలీలో రంగుల మాదిరిగా ప్రజలంతా ఒక్కటే అనే వేడుక ఈ హోలీ పండుగ అని ఆమె అన్నారు.



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

### ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.ఆదివారం స్థానిక శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో హయత్ నగర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు నోముల కృష్ణా గౌడ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు మర్రి మాధవి మహేందర్ రెడ్డి, పుల్లగూర్రం కీర్తన విజయనంద్ రెడ్డి లు బిఆర్ఎస్ కు గుడ్ బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎం ఎల్ ఎ మల్ రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రమనీయం ఆ నాట్యం..రసమయం ఆ చిన్నారుల నృత్యం..అత్యంత రసరమ్య మధురంగా సాగిన కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో అకట్టుకుంది. కూచిపూడి నృత్య కళాభిమానులకు కావాల్సినంత ఆనందాన్ని పంచింది. ఆదివారం శ్రీ పోట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో మహతి ఆర్ట్స్ థియెటర్స్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి రంజు ప్రవీణ ప్రబోధయ స్కూల్ ఆఫ్ డ్యాన్స్, మ్యూజిక్ షాద్‌నగర్ శిష్య బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఎంతగానో మంత్రముగ్దులను చేసింది. ముద్దుగారే యశోద, రామరామ, పుష్పాంజలి, సిద్ది వినాయక చే యశోద పలుకే బంగారమాయే అంశాలను నృత్యకారీనిలు అక్షయ, కౌశిక, మన్విత, శాన్వి, సిందుజ, అన్మిత, తపస్విని, రిషిత తమ నర్తనలతో ఎంతగానో అకట్టుకున్నారు. అధ్యక్షులు రాజేష్, మాజీ మంత్రి వేణుగోపాలచారి చేతుల మీదుగా నృత్య గురువు రంజు ప్రవీణను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల గ్రామంలో చోటు చేసుకుంది. షాద్‌నగర్ ఏఎస్ఐ రామచందర్ తెలిపిన వివరాల ప్రకారం వెల్జర్ల గ్రామానికి చెందిన రామకృష్ణ (35) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు వివరించారు. భార్యభర్తల మధ్య గొడవలతో తీవ్ర మనస్థాపానికి గురై మహేశ్వరం రామకృష్ణ అనుమానాస్పత స్థితిలో మృతి చెందినట్లు వివరించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నట్లు తెలిపారు. మృతుని భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## లోక్‌సభ బరిలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్

### 111మందితో బిజెపి ఐదో జాబితా విడుదల



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను బిజెపి అధిష్ఠానం విడుదల చేసింది. ఐదో విడతగా 111 మంది పేర్లను ప్రకటించింది. ఐదో జాబితాలో తాజాగా పార్టీలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త నవీన్ జిందాల్, సీతా సోరెన్‌లతో పాటు బాలీవుడ్ నటి కంగనా రనౌత్, కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ, రామాయణ్ నటుడు అరుణ్ గోవిల్‌లకు చోటు దక్కింది. యుపిలోని పిలిభిత్‌లో సిట్టింగ్ ఎంపిగా ఉన్న వరుణ్ గాంధీని తప్పించి, యుపి మంత్రి జితిన్ ప్రసాదను ఆ సీటు నుంచి బరిలో దించింది. దీంతో ఇప్పటివరకు బిజెపి ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య 402కి చేరింది. 17 రాష్ట్రాల్లో 111 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన బిజెపి ఆంధ్రప్రదేశ్‌లో 6, తెలంగాణలో రెండు స్థానాలకు, బీహార్‌లో 17, గోవాలో 1, గుజరాత్ 6, హర్యానా 4, హిమాచల్‌ప్రదేశ్ 2, జార్ఖండ్ 3, కర్ణాటక 4, కేరళ 4, మహారాష్ట్ర 3, మిజోరం 1, ఒడిశా 18, రాజస్థాన్ 7, సిక్కిం 1, ఉత్తర్‌ప్రదేశ్ 13, పశ్చిమబెంగాల్ 19 చొప్పున అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఇప్పటివరకు నాలుగు జాబితాలుగా 291 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక ఐదో జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎనిమిది మంది పేర్లు ఉన్నాయి. తెలంగాణలో మిగిలిన 2 స్థానాలకు బిజెపి అభ్యర్థుల ప్రకటించింది. వరంగల్ నుంచి ఆరూరి రమేశ్‌ను, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్ రావును పోటీకి దింపింది. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేనతో పొత్తులో భాగంగా బిజెపికి 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ తరపున పోటీ చేసే ఎంపి అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించింది.



ఎఐసిసి అధికార ప్రతినిధి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్‌ను ఆయన నివాసంలో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి చేయాల్సిన వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించారు.

## కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంట్‌కు పంపిద్దాం

### మాజీ మంత్రి, మహేశ్వరం ఎంఎల్ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** బడుగు బలహీన వర్గాల గొంతుకగా బిఆర్ఎస్ చేవెళ్ల ఎంపి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ వాణి పార్లమెంట్‌లో వినిపించేలా చేద్దమని మాజీ మంత్రి,మహేశ్వరం ఎంఎల్ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల సన్నాహక ప్రక్రియలో భాగంగా మాజీ మంత్రి,ఎంఎల్ఎ సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాజేంద్రనగర్,చేవెళ్ల ఎంఎల్ఎలు ప్రకాష్ గౌడ్ ,కాలే యాదయ్య , ఎంఎల్ సి లు సురభి వాణీదేవి,యెగ్గే మల్లేశం,దయనంద్ గుప్తా ,డిసిఎంఎస్ చైర్మన్ కృష్ణా రెడ్డి ,చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ మంత్రి,స్థానిక ఎంఎల్ఎ సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ప్రజలతో మమేకం అయిన ఒక మంచి వ్యక్తి.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎంఎల్‌సిగా ఈ ప్రాంతానికి సేవ చేశారని,బడుగు బలహీన వర్గాల గొంతుకగా జ్ఞానేశ్వర్ వాణి పార్లమెంట్‌లో వినిపించేలా చేద్దామని,అందుకు బిఆర్ఎస్ కి చెంది న ప్రతి కార్యకర్త జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపుకు కృషి చేయాలన్నారు.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ 96 బిసి కులాల ఐక్య వేదికను ఏర్పాటు చేసి అందరి ఐక్యతకు పాటు పడ్డారని కొనియాడారు. కెసిఆర్ పేరు లేకుండా చేస్తామంటే మొన్న ముఖ్యమంత్రి ప్రారంభించిన బైరాముల్ గూడ ఫ్లై ఓవర్,ఇతర ఫ్లై ఓవర్లు లేకుండా చేస్తారా..?,కాళేశ్వరం కులుస్తారా... రైతు బంధు,రైతు భీమా బంద్ చేస్తారా...అని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. అనంతరం బిఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరి సహాయ సహకారాలు కావాలన్నారు. ఎంపిగా గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.గత ఎంతో కాలంగా ఈ ప్రాంత ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. మీలో ఒకరిగా ఉంటూ చేవెళ్ల పార్లమెంట్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## బిఎన్‌రెడ్డి నగర్‌లో అక్రమ షెడ్ల నిర్మాణం

### అక్రమ కట్టడాలకు అడ్డుకట్టవేయని జిహెచ్ఎంసి అధికారులు

### అక్రమదారుల నుంచి మాముళ్లు వసూలుతో జేబు నింపుకుంటున్న టౌన్ ప్లానింగ్





**ప్రజాపక్షం/వనస్థలిపురం :** హయత్ నగర్ సర్కిల్ 3లో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో అక్రమ షెడ్లు, అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ షెడ్లు నిర్మాణం చేస్తున్నారు. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం ఎవరైన ఇడ్లు నిర్మాణం చేసుకోవాలంటే ఇంటికి సబంధించిన పత్రాలు జిహెచ్ఎంసిలో పర్మిషన్ దరఖాస్తు చేసుకుంటారు. ఇండ్లు నిర్మాణం కోసం జీప్లెష్1,2, కోసం ప్రభుత్వానికి చలాన్లు చెలిస్తారు. కానీ షెడ్లకు ఎలాంటి అనుమతి ఉండదు. ఇల్లు నిర్మాణం చేసే వారు ఒకటి రెండు లోటు పాటు ఉంటే వారిని నోటీసులు అందజేసి ఫైన్లు వేసి వసూలు చేస్తారు. కానీ షెడ్లు నిర్మాణం చేసే వారికి ఎలాంటి అనుమతి ఉండదని జిహెచ్ఎంసి వారే తెలుపుతున్నారు. ఒకవేళ పర్మిషన్ కోసం వస్తే స్థలం బట్టి ఎంత స్థలం ఉంటే అంత రుసుము చెల్లించి తత్కాలిక పర్మిషన్ పేరుతో పర్మిషన్ ఇస్తారని అధికారులు చెప్పుతున్నారు. దానికి కాల పరిమితితో 6నెలలకు, లేదా ఒక సంవత్సరం పర్మిషన్ ఇస్తారు. ఈలాంటి ఏమి లేకుండా బిఎన్‌రెడ్డి నగర్‌లోని శ్రీపురం కాలనీలోని నాగార్జున సాగర్ రోడ్డుకు అతిపెద్ద షెడ్డు నిర్మాణం చేస్తున్న జిహెచ్ఎంసి అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై జిహెచ్ఎంసి ఏసిపి, టౌన్ ప్లానింగ్, చైన్‌మెన్లు అక్రమదారులతో కుమ్మకై వ్యవహరిస్తున్నారని పులువూరు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన అదాయంను పక్కదారిని మళ్లించడంలో జిహెచ్ఎంసి అధికారులే సూత్రదారులుగా ఉన్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బిఎన్‌రెడ్డి నగర్‌లో అనేక నిర్మాణం చేస్తున్న వాటిల్లో ఒకటి కూడా పర్మిషన్ లేకుండా అక్రమ గృహ నిర్మాణం చేస్తున్న పట్టించుకోకపోవడం దారుణం మన్నారు. ఎస్‌కెడి నగర్‌లో ఒక సెల్లర్ ఎలాంటి అనుమతి లేకుండా సెల్లార్ నిర్మాణం చేస్తున్నారు. వాస్తవానికి ఎస్‌కెడి నగర్‌లో రిజిస్ట్రేషన్‌లు లేవు. కాని నిర్మాణ దారుడు అతనికి మాత్రం పర్మిషన్ ఉందని చెప్పడం జరిగింది. కాలనీల్లో ఎవరికి లేని పర్మిషన్ ఒక్కరికి మాత్రం ఎలా ఉంటదని కాలనీ వాసులు వాపోతున్నారు. జిహెచ్ఎంసి అధికారుల పరివేక్షణ లేకపోవడం వారితో అక్రమదారులకు వత్తసూ పలకడం వేనుక అర్థం ఏమిటని ప్రజల్లో చర్చలు జోరుగా సాగుతుంది. దీనిపై జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు విచారణ చేసి అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ఆ స్థలం జెఎన్‌జెఎంహెచ్‌ఎస్‌ది

### కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సొసైటీ విజ్ఞప్తి

**హైదరాబాద్ :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ గ్రామంలోని సర్వే నెం 25/2లో ఉన్న భూమిని విక్రయించేం దుకు కొందరు అసాంఘిక శక్తులు ప్రయత్నిస్తున్నారని, దీనిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యాక్ హౌసింగ్ సొసైటీ పేర్కొంది. పైన పేర్కొన్న సర్వే నెంబర్‌లోని మొత్తం భూమి రాష్ట్ర ప్రభుత్వానికి చెందినదని, అందులో సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న 38 ఎకరాల భూమిని జిఒ 424 ద్వారా 2008 మార్చి 25వ తేదీన సొసైటీకి కేటాయించినట్లు సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ భూమి 2005 నుండి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధీనంలో ఉందని తెలిపింది. అయితే ఈ భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు మ్యాక్ హౌసింగ్ సొసైటీకి అప్పగించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఈ సొసైటీకి భూమిని అప్పగించే ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించింది. అయితే భూమిపై తమకు ఎలాంటి హక్కు లేకపోయినా తాము యజమానులమని చెప్పుకునే కొందరు వ్యక్తులు భూమిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడింది. గతంలో రెండు సార్లు కోర్టులను ఆశ్రయించి విఫలమైన విషయాన్ని సొసైటీ ఆ ప్రకటనలో గుర్తుచేసింది. కబ్జాయత్నాలు చేసి ఈ భూమిలో కొంత భూమి ని అమాయక ప్రజలకు విక్రయించాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హెచ్ఎండిఎ అధికారులకు సొసైటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సొసైటీ అధ్యక్షులు బి. కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆర్. రవికాంత్‌రెడ్డి, సిఇఒ/ కార్యదర్శి ఎన్. వంశీశ్రీనివాస్, డైరెక్టర్లు పివి రణమారావు, కె. అశోక్‌రెడ్డిలు ఒక ప్రకటనను విడుదల చేశారు.

## జెసిబి ఇండియా బల్లాబ్‌గఢ్‌లో సంబరాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎర్త్‌మూవింగ్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్స్‌లో భారతదేశపు ప్రముఖ తయారీదారుడు జెసిబి ఇండియా ఐదు లక్షల మెషిన్ విడుదల వేడుకలను బల్లాబ్‌గఢ్‌లోని కంపెనీ ఇండియా హెడ్ క్వార్టర్స్‌లో జెసిబి గ్రూప్ చైర్మన్ లార్డ్ బామ్‌ఫోర్డ్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెసిబి 1979 నుంచి భారతదేశంలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఉపయోగిస్తున్నారని అన్నారు. భారతదేశంలో ఆరు తయారీ సౌకర్యాలతో జెసిబి 'మేడ్ ఇన్ ఇండియా' యంత్రాలను 130 దేశాలకు ఎగుమతి చేస్తుందన్నారు. ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటన్నారు. గత దశాబ్దంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై గణనీయమైన దృష్టి పెట్టిందన్నారు. తమ యంత్రాల ద్వారా ఈ వృద్ధిలో భాగమైనందుకు గర్విస్తున్నామని తెలిపారు. 1979 నుంచి భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం కొనసాగిస్తున్నామని చెప్పారు. తమ మొదటి ఫ్యాక్టరీని బల్లాబ్‌ఘర్‌లో స్థాపించామన్నారు. భారతదేశం ఇప్పుడు తమ గ్లోబల్ వ్యాపారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఇది మా అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటన్నారు. సంప్రదాయిక యంత్రాలతో పోలిస్తే మెటీరియల్‌ను సురక్షితంగా మరింత ఉత్పాదక పద్ధతిలో ఎత్తులో నిర్వహించడానికి ఇది ఒక విప్లవాత్మక కొత్త మార్గమన్నారు. ఈ సందర్భంగా జెసిబి ఇండియా సిఇఓ, మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ శెట్టి మాట్లాడుతూ జెసిబి నుంచి విడుదల చేసిన 500,000 యంత్రం టెలిహ్యాండ్లర్ మాత్రమేనన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిజెపి నేత సతీష్ మాదిగ

### కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి నివాసంలో బిజెపి కార్యవర్గ సభ్యులు సతీష్ మాదిగ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్లు రవి నివాసంలో సతీష్ మాదిగతో సుదీర్ఘంగా చర్చించారు. తనకు లోక్ సభ ఎన్నికల్లో మద్దతు తెలపాలని మల్లు రవి కోరారు. అందుకు సతీష్ మాదిగ సానుకూలంగా స్పందించి, కాంగ్రెస్ పార్టీలో చేరడానికి అంగీకరించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్‌లోని ముఖ్య నాయకులందరితో మాట్లాడి మల్లు రవి సతీష్ మాదిగకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా పేద, బడుగు, బలహీన వర్గాలను, మాదిగలను సంఘటితం చేసి, నాగర్ కర్నూల్ పార్లమెంట్‌తో పా టు రాష్ట్రంలో కాంగ్రెస్‌ని గెలిపించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు.

## కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ స్థానాలు గెలిపించండి

### ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలకు పిలుపునిచ్చిన సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి జిల్లా నేతలంతా కలిసికట్టుగా పనిచేసి మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానాలు గెలిపించాలని ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎంఎల్ఎలు, ఎంపి, ఎంఎల్‌సి అభ్యర్థులతో పాటు ముఖ్యనేతలతో ఆదివారం సిఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై నేతలతో విస్తృతంగా చర్చించారు. లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా నేతలు బాధ్యతలు తీసుకుని, సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం చొరవను ప్రజలకు వివరించాలన్నారు. వంద రోజుల ప్రజాపాలనలో కాంగ్రెస్ అమలు చేసిన గ్యారంటీలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నేతలంతా సమన్వయంతో పని చేసి ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు ఎంఎల్‌సిని గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు, ఎంపి అభ్యర్థులు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పాల్గొన్నారు.

## సేవాదృక్పథంతో వైద్యం అందించడం అభినందనీయం



**ప్రజాపక్షం/బోడుప్పల్:** సేవా దృక్పథంతో ప్రజలకు వైద్యం అందించడం అభినందనీయమని బిఆర్ఎస్ నాయకుడు బైటింటి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఫిర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని సత్యనారాయణపురం కాలనీలో ఆదివారం నిలీమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఈశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిలీమ హాస్పిటల్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం కాలనీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, కార్యదర్శి ధీరజ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగారెడ్డి, బిరెడ్డి మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే యువతకు గుర్తింపు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువకులు క్రీడల్లో రాణిస్తే గుర్తింపు ఉంటుందని మేడ్చల్ నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుడు పొనుగంటి మహేష్‌కుమార్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటలోని పెద్దగౌడ్ శ్రీగణేష్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు దప్పు సాయిబాబు, పొరుపల్లి నాగరాజు, మాధవరెడ్డి, మాజీసర్పంచ్ వెంకటేష్, రాజిరెడ్డి, ఉప్పల ఎల్లమయ్య, నాగేష్‌గౌడ్, మల్లేష్, తుంకి భిక్షపతి, వెంకటేష్, బాబు, నర్సింహ, తలారి కృష్ణ, కత్తి స్వామి, పోచయ్య, భాస్కర్, నర్సింహ, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

## ప్రాచీన విద్యాకళ కలారీ



**ప్రజాపక్షం/కొడంగల్ :** ప్రాచీన విద్యాకళ అయినటువంటి కలారీ విద్యను నేర్చుకున్న ఎంతో మందికి విద్యాను నేర్పుతున్న మన తెలంగాణ బిడ్డ ఇటీవలే అయోధ్యలో తన ప్రతిభను కనబరిచి ఉత్తమ అవార్డును అందుకున్న మన కొడంగల్ వాసి కావడంతో ఆదివారం విద్యార్థులకు స్థానిక ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా డిప్యూటీ డిఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, న్యాయవాదులు రవీందర్‌నాయక్, సురేష్‌గౌడ్‌లతో పాటు హిందువాహిని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వారుమాట్లాడుతూ భారతదేశంలోనే అంతరించిపోతున్న మన ప్రాచీన విద్యాకళ అయినటువంటి కలారీ విద్యాను పేదరికం అడ్డువచ్చిన తడబడకుండా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తన దృఢసంకల్పంతో ముందుకు సాగి ఈనాడు దేశవ్యాప్తంగా కొడంగల్‌కు మంచి పేరు తీసుకువస్తున్న విద్యార్థి రమేష్ అంటు ప్రశంసించారు. ఒకపక్క మన నియోజకవర్గం నుండి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి, మరోపక్క దేశస్థాయిలో కలారి విద్యలో ఉన్నత స్థాయిని నిలిపిన రమేష్‌లు ఉండటం మన అదృష్టమన్నారు. అందుకు కలారీ విద్యను మరింత ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి కొడంగల్ నుండే ఈ విద్యా మరింతగా విస్తరణ చేసేందుకు దోహదం ఉండాలని కలారి విద్యా కేంద్రానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. నేటి యువత చెడు మార్గాల ప్రయాణించకుండా ఇలాంటి విద్యాలను నేర్చడంతో వారు ఆరోగ్యంతో పాటు మంచి సన్మార్గంలో నడిచేందుకు అస్కారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వ్యాపారవేత్త లక్ష్మి నారాయణగుప్త, భానుప్రకాశ్, నవీన్, సర్వేష్, వెంకయ్య, బుక్కుల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించండి



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు ఫీజు పెంపుతో పేద, మధ్యతరగతి అభ్యర్థులపై అధిక భారం పడుతుందని రాష్ట్ర యువ నాయకులు గణపురం శాంతికుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఒ ప్రకటనలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టెట్ ఒక పేపర్‌కు దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా ఉండేది చెప్పారు.కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెట్ పేపర్1కు రూ.1,000, రెండు పేపర్ల ఫీజును రూ.2,000 పెంచడం సరికాదని అన్నారు. కేవలం 11 జిల్లా కేంద్రాల్లోనే టెట్ పరీక్ష ఉంటుందని ప్రకటించారని, దీనివల్ల మిగతా జిల్లాల అభ్యర్థులకు దూరభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటారని తెలిపారు. మొత్తం 33 జిల్లాల్లోనూ పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి పెంచిన టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోడ్డుప్రమాదంలో మాజీసైనికుడు మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నిర్మల వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా రాచర్ల మండలం గౌతమ్‌పురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు భద్రాది శివకోటయ్య(48) పంచవటి కాలనీ మేడిపల్లిలో నివాసముంటూ సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనం(ఏపి 39 ఎఫ్‌యు 3579)పై ఎన్‌ఎఫ్‌సి,హెచ్‌బి కాలనీరోడ్డు మీదుగా వెళ్తు ఇండియన్ బ్యాంకు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లింది, స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది పరీక్షించి అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి గాంధీ ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు.

## అసాంఘిక చర్యలకు పాల్పడొద్దు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మండల ప్రజలందరికీ నవాబుపేట్ ఎస్సై భరత్ భూషణ్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా ప్రతి ఒక్కరు హోలీ పండుగను జరుపుకోవాలని కోరారు.

## మా భూమి మాకు ఇప్పించండి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని మధన్‌పల్లి గ్రామనికి చేందిన జగన్మోహన్‌రెడ్డి రమాదేవి దంపతులు గ్రామస్తుల ముందు బోరున విలపించారు. జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన తాతల ఆస్తిని తనకు అప్పగించాలని గ్రామస్తుల ముందు భార్య పిల్లలతో కలిసి విలపించారు. తనకు అనారోగ్యం ఉండడంతో 2018లో జిపిఎ చేసినందున తనకు తెలియకుండా నా భూమి ని రిత్విక్‌రెడ్డి ,తండ్రి సత్యనారయణరెడ్డి డైరెక్ట్‌గా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మా కుటుంబానికి నా పిల్లలకు న్యాయం చేయాలని కోరారు.

## సత్వర న్యాయానికి పోరాడుతా..

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** చేవెళ్ల స్వతంత్ర ఎంపి అభ్యర్థిగా పోటీల్లో ఉంటానని ఈసరి సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. అదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ సత్వర న్యాయానికి, నిరుపేదలకు ఉచిత చట్టపరమైన మద్దతు కోసం ముందు ఉంటానని ఆయన తెలిపారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. గ్రామాల్లో దీనిపై విస్తృత ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో సురేష్, అదిత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మంది తాగి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపాల్ పరిధిలోని మద్గుల్ చిట్టేంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరిపల్లి జంగయ్య పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి భార్య తెలినిన వివరాల ప్రకారం... తమ పాలివారైనా కుమ్మరిపల్లి నర్సింలు తండ్రి చిన్నయ్య మా భూమిని ఎజిపి చేసుకున్నారని, మా భూమిని తిరిగి మాకు ఇవ్వమంటే ఇవ్వడం లేదని, ఈ విషయంలో చాలాసార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టిన మా భూమి తిరిగి నా భర్త పేరుపై చేయలేన్నారు. దీంతో మనస్థాపానకు గురై పురుగుల మంది తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# ఉత్తమ శిక్షణతోనే ఉన్నతమైన చదువులు

### టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ రియాజ్





**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** ఉత్తమ శిక్షణతోనే ఉన్నతమైన చదువుల్లో రాణిస్తారని, దేశ మనుగడలో సైనిక్, ఆర్‌ఎంఎస్ సూల్స్ విద్యార్థులు ప్రత్యేకత కనబర్చుతారని, క్రాంతి కీన్ అకాడమీ శిక్షణ అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రియాజ్ అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన సైనిక్, ఆర్‌ఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన క్రాంతి కీన్ అకడామీ విద్యార్థులకు దమ్మాయిగూలోని క్రాంతికీన్ అకాడమీలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ లావణ్య ఆధ్వర్యంలో సన్మానం చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రియాజ్, డీఆర్‌డీవో పద్మజారాణి, ఎన్సీఈఆర్‌టీ మెంబర్ సీహెచ్ ఉమాలు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశే... జీవిత దశ అవుతుందని, ఆధునిక కాలంలో నైపుణ్యంతో కూడిన చదువుల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని సూచించారు. సైనిక్, ఆర్‌ఎంఎస్ పాఠశాల్లో విద్యార్థులు చదువుతోపాటు, క్రీడలు, సమాజంపై పూర్తి అవగాహన కలుగుతుందని, దేశ పరిపాలన విభాగంలో విద్యార్థులే కీలకం అవుతున్నారన్నారు. విద్యార్థులు విషయాన్ని అర్థం చేసుకొని చదివే విధానం అలవాటు చేసుకోవాలని, చదువే విద్యార్థికి మూలమని పేర్కొన్నారు. క్రాంతికీన్ పాఠశాలలో చదవిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధిస్తున్నారని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ లావణ్య, ప్రిన్సిపల్ లావణ్య అన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 44వ ర్యాంకు, తెలుగు రాష్ట్రాల్లో మూడో ర్యాంకు అద్వైత్‌రెడ్డి సాధించారని, అభిరాంరెడ్డి, విజయ్‌విహాన్, విజేత ఉత్తమ ర్యాంకులు సాధించారు. 32 మంది విద్యార్థులు 5వేల ర్యాంకులు సాధించారని తెలిపారు. సైనిక్, ఆర్‌ఎంఎస్ పోటీ పరీక్షల్లో ఉత్తమ శిక్షణను అందించి విద్యార్థులను ఉత్తమ ర్యాంకులు సాధించేలా ప్రోత్సాహించిన క్రాంతికీన్ పాఠశాల బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. జేఈఈ మెయిన్స్‌లో 98.6 శాతం మార్కులు క్రాంతికీన్ అకడామీ పూర్వ విద్యార్థి సృజన్‌రెడ్డిని అభినందించారు. క్రాంతికీన్ అకాడమీలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినందుకు సన్మానం చేసి బహుమతులు అందజేశారు.

## జిల్లా ప్రజలకు కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** హోలీ పండుగ వేళ ప్రతి ఒక్కరి జీవితాల్లో అనందపు రంగులు వెల్లి విరియాలని, ప్రజలందరూ ఆనందంగా, సంతోషంగా హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్క చోట చేర్చే ఈ హోలీ వేడుకను ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సంస్కృతి సాంప్రదాయాల కనుగుణంగా జిల్లా ప్రజలు ఆనందోత్సాహలతో హోలీ వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. సంతోషం మాటున ప్రమాదం పొంచి ఉందని, పిల్లలను తల్లిదండ్రులు నియంత్రణ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

## ఈటలను గెలిపించాలి : సుధాకర్



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరిః** పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించి ప్రధాని నరేంద్ర మోడికి కానుకగా ఇవ్వాలని రాష్ట్ర బిజెపి మీడియా కన్వీనర్ కప్పర ప్రసాద రావు, రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు కె.సుధాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మల్కాజ్‌గిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈటల పని తనానికి నిరదర్శనంగా మల్కాజ్‌గిరిలో ఆయనను ఎంపిగా గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. దేశ ప్రజలతో పాటు ప్రపంచ దేశాలు మోడీ కీర్తిని కొనియాడుతున్నాయన్నారు. మోడీకి మద్దతు పలికి మళ్లీ ఆయననే ప్రధానిగా చేయాలని భావిస్తున్నారని, అందులో భాగంగా మల్కాజ్‌గిరి నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు బి.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## రూ.2లక్షల రుణ మాఫీ ఒకేసారి అమలు చేస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా

### ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని ఒకే సారి అమలు చేస్తే తాను రాజకీయాల నుండి తప్పుకొంటానని, దీనికి సిద్ధమేనా అంటూ మల్కాజిగిరి బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌కు సవాలు విసిరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆల్వాల్‌లోని హిల్స్ కాలనీ,బృందావన్‌కాలనీలలో స్థానిక నేత మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలిచ్చి ఎన్నికల్లో గెలిచి పూర్తిగా వాటిని పక్కన పెట్టారన్నారు. రైతులకు రూ. 2లక్షల రుణాన్ని మాఫీ చేస్తామన్న హామీ ఇచ్చి ఇంత వరకూ దాని ఊసెత్తక పోవటం నిజమా కాదా అని ప్రశ్నిస్తూ ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమేనన్నారు. ఇప్పటికైనా ఈ హామీ ఇచ్చిన మేరకు అమలు చేస్తే స్వచ్ఛందంగా రాజకీయ జీవితాన్ని ఇంతటితో ఆపేస్తానన్నారు. మహిళలకు నెలకు రూ 2500 పెన్షన్ లాంటి అనేక అమలు చేయలేమని తెల్సీ మరీ హామీలిచ్చి ప్రజలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం కంటె నయవంచన రేవంత్‌రెడ్డి పాల్పడుతున్నాడని విమర్శించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరిలో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ సైతం దక్కదన్నారు. మోడి కేంద్రంలో మరోసారి అధికారం చేపట్టటం ద్వారా దేశంతో పాటు తెలంగాణా మరింత ప్రగతి పథంలోకి చేరుకొంటుందన్నారు.

# బహుజనులకు ఎక్కువ సీట్లివ్వండి

### అంబేద్కర్ ఆశయసాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞాన మాల సమర్పించే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమం 266 ఆదివారాలు విజయవంతంగా పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషి ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, అధికార పార్టీలు కుల ప్రాతిపదికన ఎన్నికలలో టిక్కెట్లు ఇవ్వకుండా అగ్రవర్ణాల వారికి, వ్యాపారస్తులకు మాత్రమే టిక్కెట్లు ఇస్తూ పార్టీ కోసం పని చేసే నాయకులు కార్యకర్తలను విస్మరిస్తున్నారని అన్నారు. గతంలో కెసిఆర్ చేసిన తప్పిదాల వల్ల నేడు బిఆర్ఎస్ కనుమరుగైందని, బిఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు నేడు ఇతర పార్టీలకు వలస పోతున్నారని అన్నారు. అది గమనించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంటు ఎన్నికలలో బహుజనులకు పెద్ద పీట వేయాలని మైసయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా రాజ్యాంగ సవరణలు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. రాజకీయంగా వెనుకబడి పోతున్న బహుజనులు ప్రతి పార్టీ కుల, జనాభా ప్రాతిపదికన బహుజనులకు అధిక సీట్లు కేటాయించేవిధంగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు గురుగుల యాకయ్య, అంజయ్య, ఈతకోట గోపాలకృష్ణ, యేసు రాజు, బండారి సాయి, బెక్కం జైభీమ్, అజయ్, సవరపు బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నట్లుగా బోడుప్పల్ 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ అన్నారు. బోడుప్పల్ నగర పరిధిలోని అనఘాపురి కాలనీ రోడ్ నెంబర్ 5లో రూ.10 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైయినేజీ పనులు ఇటీవల ప్రారంభించారు. కాగా అనఘాపురి కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైయినేజీ పనులను ఆదివారం మేడ్చల్ బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అనఘాపురి కాలనీ అధ్యక్షుడు వెల్లెంకి జయపాల్ రెడ్డి కాలనీలో నెలకొన్న పలు సమస్యలను కొత్త కిషోర్‌గౌడ్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ కాలనీలో సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటుగా పార్లమెంటు ఎన్నికల అనంతరం అభివృద్ధి పనులను కూడా చేపడతామని వెల్లడించారు. అనంతరం కాలనీ ప్రతినిధులు కొత్త కిషోర్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనఘాపురి కాలనీ అధ్యక్షుడు వెల్లంకి జయపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ఆకుల సదాశివ, సమన్వయకర్త మెంతెన అబ్బసాయిలు, మైస రవిచంద్ర, బాకి బాలరాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్రమాసం రంజాన్

### ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/చర్లపల్లిః** ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ నిష్టగా రంజాన్ మాసాన్ని జరుపుకుంటారని ఉప్పల్ ఎంఎల్‌ఏ బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఆదివారం ఏఎస్‌రావు నగర్‌లోని జామా మజీద్ ఏ మహమ్మదీయలో లయన్ మహ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో 500 మంది నిరుపేదలకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు ఎంఎల్‌ఏ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,మైనార్టీ అధ్యక్షులు బద్రుద్దీన్,నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, రహీం, మహేష్‌గౌడ్, గిరిబాబు పాల్గొన్నారు.

## రజక సోదరుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్
### ఐలమ్మ నూతన విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరిః** రజక సోదరుల అభివృద్ధికి మల్కాజ్‌గిరిలోని అన్ని పార్టీల నాయకులు కట్టుబడి ఉన్నారని మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఐలమ్మ విగ్రహాన్ని మాయం చేసిన సంఘటనపై ఏ నాయకులను, వర్గాలను నిందించవద్దని, అది కొందరు దుండగులు చేసిన పని అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందరం కలిసి ఈ సమస్యకు పరిష్కారం చూపిద్దామని అన్నారు. త్వరలోనే మినీ ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామని ఆయన తెలిపారు. గౌతమ్‌నగర్ డివిజన్‌లోని జ్యోతినగర్‌లో ఉన్న జ్యోతినగర్ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతినగర్‌లో గత 40 ఏండ్లు ఉన్న దోభిఘాట్‌ను కాపాడుకుంటూ, కులవృత్తి చేసుకుంటూ జీవిస్తుంటే ఆ ప్రాంతాన్ని పార్కుగా మారుస్తూ స్థానికులు కొందరు ప్రయత్నించగా ఆ ప్రయత్నాన్ని రజక సంఘం, బిసి ఐక్య వేదిక, ఇతర సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఎదుర్కొన్నారు. అయితే ఈ ప్రాంతంలో ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కొందరు గద్దె నుంచి తొలగించి మాయం చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు స్పందించలేదని, కారకులను పట్టుకోలేదని వాపోయారు. ఈ పరిస్థితిలో అక్కడ మరో కొత్త ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించినట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం నాయకులు చీమకురి శంకర్, కొనే సంపత్, కాసర్ల నాగరాజు, కందికొండ కిరణ్‌కుమార్ రజక, బిసి కులాల ఐక్యవేదిక మల్కాజ్‌గిరి నియోజకవర్గం అధ్యక్షుడు కామల్ల ఐలన్న, ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు వగ్గు చంద్రశేఖర్‌రావు కురుమ, కరణం గోపి, జినికుంట్ల రమేష్‌గౌడ్, రజక సంఘం నాయకులు ఆర్.సత్యనారాయణ, కె.శ్రీకాంత్, ఏ.తిరుపతి, వి.సతీష్, నరేష్, బిసి నాయకులు కటికల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు ఇంటినుంచే ఓటుహక్కు

### దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
### మల్కాజిగిరి ఎంపి స్థానం పరిధిలో 15,117 మంది వృద్ధులు, 26,119 మంది దివ్యాంగులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు, 40 శాతం పైబడిన దివ్యాంగులకు వారి ఇళ్ల నుండే ఓటు వేసే సదుపాయా న్ని కలుగ చేస్తున్నారు. దీనిలోని భాగంగా మేడ్చల్ జిల్లాలో ముందస్తుగా ఫారం 12 డి ద్వారా ధరఖాస్తు ప్రక్రియను ప్రారంభించారు. ధరఖాస్తులు సమర్పించేందుకు ఏప్రెల్ 22 లోగా తుది గడువుగా నిర్ణయించి ఈ విధంగా ధరఖాస్తు చేసుకొన్న వారికే ఈ సౌకర్యం ఉంటుందని, గడువులోగా ధరఖాస్తు చేయని వారు తప్పని సరిగా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందేనని మల్కాజిగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతం తెలిపారు. ఎన్నికల కమిషన్ అధికారులు పోలింగ్ శాతం పెంచేందుకు విస్తృత ప్రచారం చేపడుతున్నప్పటికి ఓటింగ్ శాతం ఆశించిన మేరకు పెరగక పోవటం, దీనికి కారణం వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు రాలేక ఓటు హక్కును వినియోగించుకోవటం లేదని గుర్తించిన కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల జరిగిన శాసనసభా ఎన్నికల సమయం నుండి 80 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు, 40 శాతానికి పైబడిన దివ్యాంగులకు వారి ఇళ్ల నుండే ఓటు వేసే సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. దీంతో పాటు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్‌లను సహాయకులను ఏర్పాటు చేస్తున్నారు. కాగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో సీనియర్ సిటిజన్ల వయస్సును ఈ సారి నుండి 80 నుండి 85 ఏళ్లకు పెంచారు. దీని కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫారండి తమ పూర్తి వివరాలను నమోదు చేసి ఏప్రెల్ 22 లోగా ఆయా బూత్ స్థాయి బిఎల్ఓలకు సమర్పించాల్సి ఉంటుంది. ధరఖాస్తు ఫారాలను పరిశీలించి వారి ఇళ్ల వద్ద నుండి ఓటు హక్కు వినియోగించుకొనేందుకు రిటర్నింగ్ అధికారులు అనుమతిస్తారు. ముందస్తుగాఈ ధరఖాస్తు చేసుకొన్న సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు రెండు రోజుల ముందు పోలింగ్ అధికారులు, వీడియో గ్రాఫర్, పోలీసులతో పోలింగ్ బాక్స్‌తో వెళ్లి వారి ఇంటిలోని ఓ గదిలో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రత్యేకంగా ఓ కంపార్ట్‌మెంటు ఏర్పాటు చేసి పోలింగ్ అధికారులు తీసుకొని వచ్చిన బ్యాలెట్ బాక్సును ఏర్పాటు చేసి రహస్యంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా చేస్తూ ఈ ప్రక్రియ అంతా వీడియో చిత్రీకరణ సైతం చేస్తారు. ఈ విధంగా పోలింగ్ అధికారులు ధరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లిన సమయంలో వారు ఇంటిలో లేని పక్షంలో రెండవ సారి సైతం వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని చెబుతారు. పోలింగ్ సమయంలో రెండు సార్లు ధరఖాస్తుదారులు ఇంటి వద్ద లేని పక్షంలో వారు పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిందే.



మేడ్చల్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం ఓటర్ల సంఖ్య 37 లక్షల 28 వేల 417 మంది కాగా వీరిలో 85 ఏళ్ల పైబడిన వారి సంఖ్య 15,117 మంది కాగా 40 శాతానికి పైబడిన దివ్యాంగుల సంఖ్య 26,119 మంది ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమ్ పేర్కొన్నారు.

## టికెఎన్‌బిఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడిగా ఇఎల్ఎస్ నర్సింహ్మారావు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** టికెఎన్‌బిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బండారి రామ్ ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి బక్కి శ్రీధర్‌రావు అధ్వర్యంలో భూత్పూర్ మండల కేంద్రంలోని న్యూవిరా స్కూల్లో జరిగిన కోర్ కమిటీ సభ్యుల సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా టికెఎన్‌బిఎస్ అధ్యక్షులుగా జడ్చర్ల నివాసి, బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి ఇఎల్ఎస్ నర్సింగారావును ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చేత రాష్ట్ర అధ్యక్షుడు బండారు రాంప్రసాద్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎల్ఎస్ రావు యొక్క సేవలు కరణం నియోగి బ్రాహ్మణ సంఘానికి ఎంతో అవసరమని గుర్తించి ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన టికెఎన్‌బిఎస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, పాలమూరు జిల్లాలో ను సంఘం ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు వెల్దండ నర్సింహారావు, శ్రీశైల రాంచందర్‌రావు, వారణాశి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇఎల్ఎస్ నర్సింహారావు మాట్లాడుతూ అందరి సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని అన్నారు.

## చెరువు కట్ట సమస్య పరిష్కరించుకోండి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** బాదేపల్లి 7వ వార్డులో ఉన్న పోచమ్మ చెరువు కట్ట కింద అక్రమ నిర్మాణం జరుగుతుంది. ఈ నిర్మాణం కారణంగా దేవాలయానికి రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. కట్ట పైనుండి నడిచే వాహన దారులకు చెరువు కట్ట దెబ్బతినే అవకాశం ఉంది. 2019 ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువు కట్టకు 30 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణం చేయడానికి వీలులేదు. సదరు ప్లాటు దారుడు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా నిర్మాణం చెపట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ నిర్మాణం అవకాశ్‌తో పాతబజార్ ప్రజలందరికి ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. కావున మంగళవారం రోజు ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీ యందలి కార్యాలయానికి ప్రజలు ఇట్టి నిర్మాణానికి వెంటనే నిలిపివేయాలని ఈ సమస్య మరల పునరుద్ధరణ జరుగకుండా చర్యలు చెప్పాలని అధికారులకు ఫిర్యాదు చేయదానికి వెళ్తున్నారు. పాతబజార్ ప్రజలందరి సమస్య కావున యువకులు పెద్దలు మంగళవారం ఉదయం 10 గంటలకు పోచమ్మ దేవాలయం వద్దకు రాగలరని కోరారు.

## బిజెపిలో చేరికలు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** పార్లమెంట్ ఎన్నికల వేళ మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో రాజకీయం రంజుగా సాగుతోంది . బీజేపీ అభ్యర్థి డికే అరుణమ్మ ఆధ్వర్యంలో ఆ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆదివారం మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని బాలానగర్ లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు అరుణమ్మ ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. వీరందరికి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి సాధారంగా స్వాగత్తివచారు.

**ఆదరించండి. అభివృద్ధి చేస్తాను**

పాలమూరు ప్రగతి కోసం బీజేపీ ని గెలిపించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి డికె అరుణ. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి పార్టీ గెలుపులో భాగస్వాములు కావాలని సూచించారు అరుణమ్మ.

## మన్నెంకొండ లక్ష్మీదేవికి ఒడిబియ్యం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** జిల్లా పద్మశాలి సంఘం మహబూబ్నగర్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా అమ్మవారికి చీర, సారే, ఒడిబియ్యం అందించడం జరిగింది. ఉదయం పద్మావతి కాలనీ కమాన్ నుండి బైక్ ర్యాలీ, అశోక్ టాకీస్ నుండి వన్‌టౌన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో సాంప్రదాయ దుస్తులతో మేళ, తాళాలతో భజన కోలాటలతో నిర్వహించడం జరిగింది. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి చీర, సారే సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అప్పం అనంతరాములు, బిజ్జ శంకర్, సూర ప్రతాప్, దాసు వెంకటేశ్, డా.భీంపల్లి శ్రీకాంత్, కోడి సుకుమార్, భాస రామ స్వామి, పల్లాటి తారకం, కడుదాసు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు పల్నాటి బాలరాజు, కోడి రాజశేఖర్, కొంగరి వెంకటేశ్, నీలి కిశోర్, వాసి రాజు, మహిళా కమిటీ విజయలక్ష్మి , రేణుక, స్వరూప, సదాలక్ష్మి , ఉమాదేవి, రమాదేవి, మానస పూజ, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెల్లరక్తకణాలు దానం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మానవత్వం నీడన ఎదిగాడిలా మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం కష్టాల్లో అతని గుండె కరిగి కరుణతో అక్కున చేర్చుకుని సహాయం అందిస్తుంది. ఎన్నో ఊహించని నిస్వార్థ సమాజ సేవలు తన చేతులు అందిస్తోంది. అదే యువశక్తి ఫౌండేషన్ కోయిల్‌కొండ గ్రామానికి చెందిన రాజునాయక్ డెంగ్యూ జ్వరం కారణంగా ప్లేట్లెట్స్ తగ్గడంతో ప్రభుత్వ హాస్పిటల్‌లో అడ్మిట అవ్వగా అతనికి వెంటనే ఓనెగిటివ్ ప్లేట్లెట్స్ కావాలని కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ ని ఆశ్రయించడంతో స్పందించిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు ఫౌండేషన్ మెంబర్ అంజనేయులుతో రక్తదానం చేయించారు. ఇప్పటివరకు యువశక్తి ఫౌండేషన్ ద్వారా 20 వేలకు మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశామని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, హన్వాడ మండలం అధ్యక్షులు శివ ముదిరాజు, కరుణాకర్, లాల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో షాలీమార్ ఫంక్షన్ హాల్ లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ,టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు హాదీ, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ ఫయాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఎన్‌పి వెంకటేశ్, జాకీర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మ ణ్ యాదవ్, అజ్మత్ అలి, జాబేరిబిన్ సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఇండియా' కూటమి చెక్కు చెదరలేదు

జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 'పిల్లిమొగ్గ' వేసినప్పటికీ, టిఎంసి సుప్రీమో మమతా బెనర్జీ బెంగాల్‌లో పొత్తును కాదన్నప్పటికీ 'ఇండియా' కూటమి యథాతథంగా ఉన్నదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ ఆదివారం స్పష్టం చేశారు. అవినీతి గురించి ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోడీ సాగిస్తున్న ప్రచారం 'డొల్ల' అని రమేష్ తోసిపుచ్చారు. ఢిల్లీలోని 'పిటిఐ' వార్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో పిటిఐ ఎడిటర్లతో రమేష్ ముఖాముఖి మాట్లాడుతూ.. ప్రతిపక్షం ఎన్నికలలో సగం మార్కు 272ను దాటుతుందని, బిజెపిని అధికారంలో నుంచి దింపివేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్లు, ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్, జెఎంఎం నేత హేమంత్ సోరెన్ అరెస్టులు, లోక్‌సభ ఎన్నికలలో అమేథీ, రాయబరేలి నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా పోటీపై ఊహాగానాలు సహా పలు అంశాలపై జైరామ్ రమేష్ మాట్లాడారు. 'ఎలక్టొరల్ బాండ్ల పథకం తీరును గమనించండి. రూ.4000 కోట్ల బాండ్లను రూ. 4 లక్షల కోట్ల కాంట్రాక్టులతో ముడిపెట్టారు. ఎలక్టొరల్ బాండ్లు, కాంట్రాక్టుల మంజూరు మధ్య సంబంధం ఉంది' అని రమేష్ పేర్కొన్నారు. బిజెపి ఎంపి ఒకరు మౌలిక వసతుల కల్పన కాంట్రాక్టులు పొందిన తరువాత ఎలక్టొరల్ బాండ్లు కొనుగోలు చేశారు అని ఆయన ఆరోపించారు. 'మోడీ అవినీతి నిరోధక ప్రచారాన్ని చేపట్టి, అవినీతిపై తన పోరాటానికి హేమంత్ సోరెన్, అర్వింద్ కేజ్రీవాల్‌లను ఉదాహరణలు చూపడం బోగస్. ఎలక్టొరల్ బాండ్ల అంశాన్నే తీసుకుంటే అది పూర్తిగా క్విడ ప్రో కో కేసు' అని రమేష్ అన్నారు. ప్రతిపక్షాల మధ్య ఐక్యత గురించి రమేష్ ప్రస్తావిస్తూ.. డిసెంబర్ 19న మొత్తం 28 పార్టీలు సంఘటితంగా ఉన్నాయని, కానీ నితీశ్ కుమార్ పిల్లిమొగ్గ వేశారని, మమతా బెనర్జీ తాను మమతా బెనర్జీగానే ఉండాలని నిర్ణయించుకున్నారని, ఆ రెండు సంఘటనలు సంభవించాయని ఆయన తెలిపారు. 'ఇండియా' కూటమిలో నితీశ్ కుమార్ భాగం కానంత మాత్రాన కూటమి కూలిపోయిందని అర్థం కాదని ఆయన అన్నారు. ప్రతిపక్షంసగం మార్కును దాటుతుందని,'272 సీట్లకు పైనే వస్తాయని తన నమ్మకమని రమేష్ చెప్పారు. 'ఇండియా కూటమి బుడగ బద్దలైందా అన్న ప్రశ్నకు 'లేదు, లేదు. ఎక్కడ బద్దలైంది?' అని ఆయన అన్నారు. కూటమిలో ఆప్ ఉన్నదని, ఎన్‌సిపి, శివసేన, డిఎంకె, జెఎంఎంతో పొత్తు కొనసాగుతోందని రమేష్ తెలిపారు.

## ఘనంగా కళ్యాణ్‌రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం / చిన్నంబావి :** మండల కేంద్రంలోని కేఎంఆర్ ట్రస్టు చైర్మన్ కొత్త కళ్యాణ్ రావు, జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన వేడుకలో కళ్యాణ్ రావు, కుమారుడు అన్నరావు పాల్గొని కేక్ కటింగ్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అన్నరావుతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నో నీరు పేద కుటుంబాలను ఆదుకున్న వ్యక్తి కళ్యాణ్‌రావు అని మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరాంరెడ్డి, ఆకుల వెంకటేష్ , లక్ష్మి నాఆరాయణ, శివ మల్లయ్య, సుధాకర్ నాయుడు, మోహన్‌యాదవ్ , గంగాధర్ యాదవ్ , జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారంలో డికె అరుణ

**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ బ్యూరో :** ఎన్నికల ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డి.కె. అరుణ పాలమూరు ప్రజలను పొద్దు పొద్దున్నే అప్యాయంగా పలకరిస్తూ నేను మీ అరుణమ్మని ఈ సారి నాకు సపోర్ట్ చేయండి సేవ చేసుకుంటాననంటూ మహబూబ్‌నగర్ వాసులతో మమేకం అవుతున్నారు. తాజాగా ఆదివారం ఉదయం మహబూబ్‌నగర్‌లోని బాయ్స్ కాలేజీ గ్రౌండ్‌లో వాకర్స్‌ను, మహిళలను , చిన్నారులను పలకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉదయం మహబూబ్‌నగరర్ బాయ్స్ కాలేజీ గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడిన అరుణమ్మ, గ్రౌండ్‌లోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తూ చిన్నారులు, మహిళలతో షెటిల్ అడి అందరి దృష్టిని ఆకర్షించారు.

## ప్రశాంతంగా హోలీ జరుపుకోవాలి

### జిల్లా ఎస్పీ కె. రక్షిత మూర్తి



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ఈనెల 25న జరుపుకుంటున్న హోలీ పండుగను ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఆలజడలు ఆరాచకాలు , గొడవలు చేయకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ కె. రక్షిత తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. రక్షిత మూర్తి మాట్లాడుతూ రేపు సోమవారం దేశ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్న హోలీ పండుగను వనపర్తి పట్టణంలో పాటు వనపర్తి సర్కిల్ పరిధిలోని మీద గ్రామాలలో మండలాలలో రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, విద్యార్థులు, మహిళలు, ప్రతి ఒక్కరు హోలీ సంబరాలను ఆనందోత్సవాల మధ్య ప్రశాంతంగా నిర్వహించి శాంతి భద్రతలకు విఘాతం కలవకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త పాటించాలని అన్నారు. హోలీ సందర్భంగా యువకులు మద్యం సేవించి విచ్చలవిడిగా రోడ్లపైన త్రిబుల్ రైడింగ్ ద్విచక్ర వాహనాలను నడుపుతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతేకాక హోలీ పండుగ సమయానికి పూర్తి చేయాలని ఆ తర్వాత స్నానాలకు వెళ్లాలనుకున్న చిన్న పిల్లలు చెరువులలో కుంటలలోకి స్నానాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పాటించాలని వారు పిలుపునిచ్చారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న వనపర్తి అభివృద్ధి కోసం శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరు చేయి చేయి కలిపి కృషి చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యంగా యువత తగు జాగ్రత్తతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు.

## బాలన్నను కలిసిన బిజెపి నాయకులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** మండల కేంద్రంలోని దేవరకద్ర బాలన్న నివాసంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యి జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి డి.కె. అరుణను గెలిపించే దిశగా గ్రామాల్లోని బూత్ అధ్యక్షులు తమ బూతులోని కార్యకర్తలు సిద్దంగా ఉండాలని వివరించారు. నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పథకాలు గడపగడపకు వివరిస్తూ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ప్రతి అభివృద్ధి నరేంద్రమోడి చొరవతోనే జరగాయన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే ప్రతి రూపాయి కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీ స్వయంగా గ్రామ పంచాయతీలకు నేరుగా పంపిస్తున్నారు. జరగబోయే ఎలక్షన్‌లో పాలమూరు ఎంపీ అభ్యర్థి డి.కె. అరుణమ్మని అందరం కలిసికట్టుగా పని చేసే విధంగా కార్యాచరణ ఉండాలని మండల నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.



## రమణీయం రథోత్సవం

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** మండల కేంద్రంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8న శ్రీరంగనాథుని రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ఆలయ ధర్మకర్త కృష్ణ దేవరాయులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గర్భగుడి నుంచి భూదేవి , శ్రీదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి ఉత్సవమూర్తులను శోభాయనంగా అలంకరించిన రథం వద్దకు మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు పురోహితుల వేదమంత్రాల నడుమ ప్రధాన ద్వారం నుండి ఆలయ ఆవరణంలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. రంగురంగుల పూలు మామిడి తోరణాలతో ముస్తాబు చేసిన రథంపై భూదేవి , శ్రీదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు భక్తి పారవశంతో గోవింద నామస్మరణతో రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా శ్రీరంగాపురం సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం , శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర మంచినీళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ వ్యవస్థ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణదేవరాయులు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉప అధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మెగారెడ్డి, జడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ , స్థానిక సర్పంచ్ వినీల రాణి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ టీచర్‌కు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** పాన్‌గల్ మండలం అన్నారం సెక్టర్ శాగాపూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ అలివేల బైక్‌పై నుంచి కింద పడి తలకు బలమైన గాయమై హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజి ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్నారు. వనపర్తి జిల్లా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ , హెల్పర్స్ యూనియన్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అలివేల ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ. 1,34,700లను అలివేల భర్త పరంధాములుకు అందజేశారు. ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అలివేలను సిఐటియూ వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ , జిల్లా సహాయ కార్యదర్శులు, ఆర్ఎస్ రమేష్ , సూర్యవంశం రాము, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ , ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కవిత, జిల్లా నాయకురాలు శారదతో పాటు పలువురు అంగన్‌వాడీ ఉద్యోగులు పరామర్శించారు.

## నేడు కల్వకోల్‌లో అగ్నిగుండం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని కల్వకోల్ గ్రామ సమీపంలో క్రీస్తుశకం 1670 సంవత్సరంలో ఆనాటి చోళరాజులు నిర్మించిన నందికోటేశ్వరస్వామి నంది గుడి ఆలయంలో ఈనెల 25న సోమవారం తెల్లవారుజామున 5గంటలకు కల్యాణోత్సవంతోపాటు అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సారంగధర కోటేశ్వరస్వామి తెలిపారు. పూర్వం కల్వకోల్ గ్రామాన్ని కల్వలకొలను అనే పేరుతో పిలిచేవారని రానురాను కల్వకోల్ గ్రామంగా అవతరించిందని శాస్త్రీయ పండితులు పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. కల్వకోల్, చెన్నపురావుపల్లి, కొండ్రావుపల్లి మూడుగ్రామాల మధ్యన ముచ్చటగా శివపార్వతులు కొలువుతీరడం ఈప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తారు. ప్రతి సంవత్సరం నందికోటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం హోలిపండుగ కాముని పున్నంరోజు శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం అగ్నిగుండ మహా కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాలనుంచి ప్రజలు భక్తులు తరలివస్తారు. మండుతున్న అగ్నిగోళంలో వేడినిప్పులలో భక్తులు నడుచుకుంటూ వెళ్లే సాంప్రదాయం ఇప్పటివరకు ఈప్రాంతంలో కొనసాగుతుంది భక్తులపాదాలకు ఎలాంటి గాయాలు కాకపోవడం ఈప్రాంత ప్రజలు శివుని మహిమగా భావిస్తారు.

## కేసులు పెట్టి వేధించిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు



**ప్రజాపక్షం /పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలను , నాయకులను కేసులు పెట్టి వేదించిన బీఆర్ఎస్ పార్టీ వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని కార్యకర్తలు నాయకులను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి గ్రామంలో కొండారెడ్డి ఇంటి దగ్గర ఏర్పాటు చేశారు. చేరికల విషయం తెలుసుకున్న గ్రామంలోని నిఖార్సైన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అడ్డుకొని చేరికలను ఆపారు. పార్టీలో చేరడానికి వస్తున్న వారి గురించి తెలుసుకోవాలని, వారికి ప్రజల్లో పేరుందా ... లేదా , ప్రజల బలం ఉన్న విషయం గురించి గ్రామంలో అడగాలని సూచించారు. అవినీతి అక్రమాలు, దుర్వినియోగం , స్కాంలు, స్కీంలు స్వాహా గురించి విచారణ చేయాలని గొడవకు దిగారు. అయిదు సంవత్సరాల కాలంలో గ్రామంలో ఉన్న నాయకుల గురించి తెలుసుకోవాలన్నారు. గత పదిఇ సంవత్సరాలుగా ఇప్పుడు చేరే నాయకులు టీఆర్ఎస్ పార్టీలో ఉండి ఆ పార్టీకి చెడ్డ పేరు తెచ్చారని ఆ నాయకులకు విలువలు ఉన్నాయా లేవా తెలుసుకొని పార్టీలో చేర్చుకోవడం మంచిదని కార్యకర్తలు వాపోయారు. అక్రమంగా కేసులు పెట్టి స్వల్పానందం పొందారని దందాలు చేసుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని అలాంటి వారికి ఎప్పుడు విలువలు ఉండవని పది సంవత్సరాల కాలంలో గ్రామంలో ఉన్న నాయకుల గురించి తెలుసుకొని పార్టీలో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు.

## మల్లురవికి ఘనసన్మానం




**ప్రజాపక్షం/వెల్దండ :** ఇటీవల కాంగ్రెస్‌పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపి అభ్యర్థిగా ప్రకటించిన శుభసందర్భంగా మండల మాజీ ఎంపిపి జయప్రకాష్ ఆదివారం మల్లురవి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన సందర్భంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలుచేయడం ఎంతో అభినందనీయమని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో డాక్టర్ మల్లురవి అత్యధిక మెజార్టీతో విజయం సాధించనున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఆయనవెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు నగేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం పండుగ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని వార్కంటిన్ మెమోరియల్ ఎంబిచర్చ్‌లో ఆదివారం మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాస్టర్ రెవరెండ్‌జేబిరాజు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఖర్జూరపు మట్ట, ఈతమట్టలు చేతపట్టుకొని పట్టణ పురవీధుల్లో ఏసుక్రీస్తుకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ఆరాధన చేపట్టారు. జేబిరాజు మట్ట వాక్య సందేశం ఇచ్చారు. సంఘం వైస్‌చైర్మన్ స్టీవెన్‌సన్‌ప్రేమ విందును ఏర్పాటుచేశారు. చర్చి సంఘం సభ్యులు జగదీష్, సురేష్‌బాబు, ఇజ్రాయిల్ , పాస్టర్ అమ్మజ్యోతి, పద్మ, వైదూర్య , యూత్‌సెక్రటరీనందు, జాయ్ పాల్గొన్నారు.

## దేవాలయ అర్చకులకు సన్మానం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని దక్షిణకాశిగా పేరుపొందిన శ్రీ అంబరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా 12రోజులు నిత్య అన్నదాన కార్యక్రమంకు సహకరించిన దేవాలయ అర్చకులు బాల స్వామి, కృష్ణయ్య, నరహరి, సురేష్, శివప్రసాద్, సంతోష్, సింహారెడ్డి దంపతులకు దేవేందర్, మల్లేష్, జియాగూడయాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్యాయాదవ్, మండలి మహేష్ యాదవ్ అంబ రామలింగేశ్వరస్వామి ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం , నిత్యపూజలు నిర్వహించినటువంటి పూజారులకు సన్మానంచేసిన జక్కుల జంగయ్యాయాదవ్ వారివెంట శ్రీనివాస్, కొండల్, నరేష్, మహేష్ ఉన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని ముష్టిపల్లి గ్రామానికిచెందిన బోయమండ్ల లింగస్వామి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లికృష్ణారావు లింగస్వామి మెరుగైన వైద్యంకోసం సిఎం సహాయనిధి నుంచి 36500చెక్కును మంజూరు చేయించారు. మంత్రి జూపల్లికృష్ణారావు, ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ఆదేశాలమేరకు ఆదివారం కవి, గాయకులు గాదరి చంద్రశేఖర్ ఆదివారం లింగస్వామి కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. మంత్రి జూపల్లికృష్ణారావుకు, ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్‌కు బాధిత కుటుంబసభ్యులతోపాటు గాదరి చంద్రశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## టెట్ ఫీజు వెంటనే తగ్గించాలి



**ప్రజాపక్షం/వెల్దండ :** కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులనుంచి ఎలాంటి ఫీజులు వసూలుచేయకుండానే పోటిపరీక్షలు నిర్వహిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలోచెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు దేశంలోనే ఏరాష్ట్రంలోలేని విధంగా టెట్‌పేపర్1కి ఫీజు రూ.1000, పేపర్2కి రూ.1000 అధికఫీజు వసూలు చేస్తున్నారని వెల్దండ మండల బిఆర్ఎస్‌పార్టీయూత్ అధ్యక్షుడు జంగిలియాదగిరి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని స్థానిక విలేకరులతో యాదగిరి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యాశాఖ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలచేస్తే రూ.200లనుంచి రూ.400లఫీజు ప్రవేశపెట్టేవారని ఇప్పుడు ఏకంగా కాంగ్రెస్‌ప్రభుత్వం అధికమొత్తంలో ఫీజు పెంచి నిరుద్యోగులపొట్టకొట్టడం సరికాదని, పెంచిన టెట్‌ఫీజును వెంటనే తగ్గించి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు.

## ఘనంగా హజ్రత్‌సయ్యద్ హక్కానిషా సహబ్ ఉర్సు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గంధం ఉత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. సయ్యద్‌హక్కాని షాసహబ్ దర్గాలో భక్తి శ్రద్దలమధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకుల నివాసాలలో ఖవ్వాలి కార్యక్రమాలతో ఫాతిహా అనంతరం దర్గాలో గంధం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. సయ్యద్ ఇమ్రాన్‌చిస్తి నివాసంలో ఖవ్వలి, గంధం ఉత్సవం నిర్వహించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సయ్యద్ జమాల్ భాషా నివాసంలో ఆధ్యాత్మిక ఖవ్వాలి కార్యక్రమం అనంతరం గంధం సమర్పణ కార్యక్రమాలు భక్తిశ్రద్దల మధ్య ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాలలో ఉన్న హజ్రత్ సయ్యద్ హక్కానిషా సాహెబ్ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమాలు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు దీప అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.

## సిసిరోడ్లకు నోచుకోని దళితవాడలు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని మేజర్ గ్రామపంచాయతైన కల్వకోల్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ పాలనలో దళితవాడలలోని కొన్ని కాలనీలు సిసిరోడ్లకు నోచుకోలేదు. గత పాలకులకు సిసిరోడ్లు నిర్మించాలని ఎన్నిసార్లు విన్నవించిన సిసిరోడ్లు వేయాలేదని కాలనీవాసులు సంఘం శంకరయ్య, బ్యాగరికుమార్ సంఘం శ్రీరామ్, చింతలపల్లి కుర్మయ్య తెలిపారు. ఇప్పటికైనా కొల్లాపూర్ నియోజకవర్గ మండల స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చిన ఇండ్లు దళితవాడల ఇండ్లకాలనీలకు సిసిరోడ్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## మ్యాట్రిమోనిలో పరిచయమైన మహిళకు రూ.2.71 కోట్ల టోకరా

**హైదరాబాద్ :** షాది.కామ్ మ్యాట్రిమోనిలో మహిళను మోసం చేసి, భారీ మొత్తంలో డబ్బు కాజేసిన సైబర్ నేరస్థుడు శ్రీబాల వంశీకృష్ణను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 16వ తేదీన హైదరాబాద్ మదీనాగూడకు చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. షాదీ.కామ్ మ్యాట్రీమోనీలో మహిళతో పరిచయం పెంచుకుని, తను గ్లెన్‌మార్క్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు, సదరు మహిళను అమెరికా తీసుకెళ్తానని మోసపు వాగ్దానాలు చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అందుకు తన సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని, పెంచేందుకు తన కంపెనీ నుంచి రుణాలు ఇస్తానని నమ్మబలికి, ఆమెకు సంబంధించిన బ్యాంకు వివరాలు తీసుకుని 2.71 కోట్ల రూపాయలు కాజేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడిపై గతంలో 9 కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.




## రేపు ధర్మభిక్షం 13వ వర్ధంతి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపి కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం(ధర్మభిక్షం భవన్)లో నిర్వహిస్తున్నట్లు సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన అంతమొందించి పేద ప్రజల హక్కులను స్వేచ్ఛను కాపాడారని గుర్తు చేశారు. దోపిడీ, వెట్టిచారికి దొరల, దౌర్జన్యాలు భూస్వాముల అరాచకాలు వేదింపులు నిర్మూలించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చిన విప్లవ యోధుడు కామ్రేడ్ ధర్మభిక్షమని కొనియాడారు. వర్ధంతి సభలో కార్మికులు, కర్షకులు, పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, గీత కార్మిక సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దోరెపల్లి శంకర్, చామల అశోక్ కుమార్, నిమ్మల ప్రభాకర్, దీకొండ శ్రీనివాస్, తోట నర్సయ్య, బూర సైదులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంతోనే పేదల బతుకుల్లో మార్పులు

షాద్‌నగర్ ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇందిరమ్మ రాజ్యంతోనే గ్రామీణ ప్రాంత పేద ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ ఎంపిపి ఖాజా ఇద్రీస్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేసి ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపిపి ఇద్రీస్‌తోపాటు సుమారు వందమందికి పైగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి హస్తం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికి మౌళిక సౌకర్యాలు కల్పించాలంటే ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమవుతుందని వివరించారు. స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కన్న కళలను నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆరు గ్యారంటీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలి




**ప్రజాపక్షం/నందికొండ :** పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి నేచర్ క్యాంపులు దోహదపడతాయని జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి అన్నారు. నాగార్జునసాగర్ యూత్ హాస్టల్లో నేచర్ క్యాంపు ముగింపు సమావేశంలో వనం లక్ష్మీపతి, రాష్ట్ర యన్.జి.సి. ప్రతినిధి ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వ పర్యావరణ అడవుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ తెలంగాణ రాష్ట్ర జాతీయ హరిత దళాలు హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నేచర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, ఈ క్యాంప్‌లో మొత్తం 5 పాఠశాలల నుండి 50 మంది విద్యార్థులు గత 2 రోజుల నుండి పాల్గొంటున్నారని అన్నారు. రోజు రోజుకు అడవులు విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల జంతువులు, అందమైన పక్షులు, కీటకాలు అంతరించి పోతున్నాయన్నారు. వాతవరణంలో కార్బన్ డయాక్సైడ్ శాతం పెరగడం వల్ల చుట్టు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. పరిసరాల గాలి, నీరు, నేల విపరీతంగా కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తన వంతు బాధ్యతగా మన చుట్టు మొక్కలు నాటి సంరక్షించాలని నీటిని పొదుగావాడాలి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి అప్పుడే పర్యావరణ పరిరక్షణకు చేయూత అందించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల గైడ్ ఉపాధ్యాయులు జి.రమాదేవి, ఆలివేలు, ఆకుల సునీత, సిహెచ్. చంద్రకళ,విద్యార్థినిలు పాల్గున్నారు.

## బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో కాంస్య పతకం




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్:** ఆలిండియా పోలీస్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన పల్లె కాశిరెడ్డి కాంస్య పతకం సాధించడం జరిగింది. కాగా కాశిరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని వనస్థలిపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్( ఏసిపి)గా విధులు నిర్వహిస్తున్నారు.ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చక్కర వీరారెడ్డి కాంస్య పతకం సాధించిన కాశీరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.జరిగిఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ఏసిపిగా విధులు నిర్వహిస్తూ పలు ఆలిండియా పోలీస్ ఆటలపోటీలలో పాల్గొని పతకాలు సాధించడం మా గ్రామానికి గర్వకారణమని ఆయన అన్నారు.

## రూ.16.5లక్షల నగదు పట్టివేత

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు టోల్ ప్లాజా వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున పట్టణ సిఐ ప్రతాప్ లింగం ఆధ్వర్యంలో రాయికల్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ ప్రతాప్‌లింగం మాట్లాడుతూ వనపర్తి జిల్లా నుండి హైదారాబాద్‌కు వెళ్తున్న జయదేవ్ అనే వ్యక్తి వద్ద రూ.16.5లక్షల నగదుతోపాటు 5.5కిలోల వెండి లభించినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా వాహనాలను తమ సిబ్బందితో తనిఖీలు చేస్తున్న సమయంలో ఆర్‌టిసి బస్సులో వెళ్తున్న జయదేవ్ అనే వ్యక్తి వద్ద లభించినట్లు, వాటిని సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. స్వాధీనం చేసుకున్న డబ్బు, వెండిని షాద్‌నగర్ ఎన్నికల అధికారికి అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలించరాదని, ఒకవేళ తరలిస్తే అందుకు సంబంధించిన వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని వివరించారు.

# ఎలక్టోరల్ బాండ్లతో బూర్జువా పార్టీల దోపిడీ బయటపడింది

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** అధికారంలో ఉన్నప్పుడు కార్పోరేట్ సంస్థలకు,ఇతర అక్రమ మార్గాలకు చేసిన సేవలకు గాను బుర్జువా పార్టీలు ఎలక్టోరల్‌బండ్ల రూపేనా విరాళాలను పొందాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ విమర్శించారు. మండలపరిధిలోని ఏదులాపురం గ్రామంలో ఇటీవల దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, సిపిఐ, యువజన సంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల బహుమతులను సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలకు పెట్టింది పేరైన బిజెపి ఈ అక్రమ విరాళాలను పొందడంలో అగ్రభాగంలో నిలిచిందని ఆరోపించారు. అటు తర్వాత ఇతర బూర్జువ పార్టీలు ఈ పాపంలో పాలు పంచుకున్నాయన్నారు. ఈ వ్యవహారాన్ని బట్టి చూస్తుంటే దేశ సంపదను, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎంత దుర్వినియోగం చేశారో ఇట్టే అర్థమవుతందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఒక్క రూపాయి విరాళాన్ని సేకరించలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. తమ నిబద్ధతకు ఇది ఒక తార్కాణంగా నిలిచిందని, ప్రజల పక్షాన తమ వైఖరేంటో తేటతెల్లం చేసిందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ...ఏదులాపురం అభివృద్ధి సిపిఐ పార్టీతోనే సాధ్యమైందన్నారు. పేద ప్రజల ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కోసం పోరాటం చేసిం సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, ఐఎఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ నాయకులు మిడకంటి పెద్ద వెంకట్ రెడ్డి, దండి రంగారావు, వెన్నం భాస్కర్ పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తున్నాం

వి.ఎస్ బోస్




**ప్రజాపక్షం/చర్లపల్లి :** ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు.ఆదివారం భారత కమ్యూనిటీ పార్టీ సిపిఐ కాప్రా శాఖ ఆధ్వర్యంలో ఇసీఐఎల్ చౌరస్తాలో కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వివిఎస్ బోస్ మాట్లాడుతూ ఎస్‌బిఐ బాండ్లు సమాచారం బయటికి వచ్చిన అనంతరం మోడీకి ఓటమి భయం పట్టుకుని ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని నీరుగాస్తున్నారని దుయ్యబట్టారు.ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన 33 కంపెనీలకు 3.7 లక్షల కోట్లు విలువగల కాంట్రాక్టులు దక్కాయని అన్నారు.ఈడీ,సిబిఐ, ఐటి దాడులు ఎదుర్కొన్న 41 కంపెనీలు బిజెపికి 2471కోట్లు బాండ్ల రూపంలో ఇచ్చారు.మరో షెల్ కంపెనీలు 143 కోట్లు విరాళంగా ఇచ్చారని,ఇందులో అధికార పార్టీకి 580 కోట్లు బాండ్ల రూపంలో ఇచ్చిన సంస్థలకు 62 వేల కోట్ల కాంట్రాక్టులు దక్కాయని అన్నారు.భారత దేశంలోనే అతి పెద్ద కుంభకోణంపైన ఎలక్టారోల్ బాండ్లపై స్వతంత్ర సిట్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అతి తొందరలో మూల్యం చెల్లించుకుంటుందని అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్ శంకరరావు,ఇసీఐఎల్ యూనియన్ మాజీ కార్యదర్శులు ఎన్ నర్సింహ, జోషి,నాయకులు శ్రీనారాయణ,ఎం నర్సింహరావు,నాగేశ్వరరావు,సాంబశివరావు,సోమరాజు,డి సుధీర్ రాజు,లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి




ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ అర్బన్ మండల గ్రామాలైన చింతల్ ఠానా, కొడుముంజ, ఆర్ అండ్ ఆర్ కాలనీలా గ్రామ పంచాయతీ కార్మికుల మండల కార్యవర్గం ఎన్నిక అధ్యక్షులు అధ్య వేణు సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో అధ్యక్షులు కూర బాలయ్య, ఈసం దేవయ్య ఉపాధ్యక్షులుగా మేర్గ దుర్గయ్య, ఉపాధ్యక్షులు తాళ్ల పెల్లి రామయ్య, ప్రధాన కార్యదర్శి కుడికందుల రమేష్, సహాయ కార్యదర్శి దుంద్రపల్లి లక్ష్మీనారాయణ, కోశాధికారి గుంద్రపల్లి రవీందర్, జిల్లా కన్వీనర్ గా మాన్వాడ పరమేశ్వర్, ప్రచార కార్యదర్శిగా కాంసాని రాజనర్సు, కార్యవర్గ సభ్యులు చిట్యాల మల్లవ్వ, అలుగొండ ప్రమీల, కుర్మయ్య, కాంసాని నాగరాజు,మెరుగు రాగయ్య, పసుల ముత్తయ్య, శేఖర్, సర్వ మండయ్య, కొదురుపాక దేవయ్య, బుర్ర దేవరాజు, నేరెళ్ల వెంకటేశం, భోజ్జ రామయ్య ఏఐటియుసి గ్రామపంచాయతీ నూతన కార్యవర్గంగా ఎన్నుకోవడం జరిగిందని ఏఐటియుసి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, రాజ్యాంగం తెలిపిన ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నేషనల్ పే స్కేల్ తెలిపిన ప్రకారంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈ ఎస్ ఐ పిఎఫ్ హెల్త్ కార్డులను ప్రమాద బీమా సౌకర్యాలను కార్మికులకు వేతనంలో సగం వేతనాన్ని పెన్షన్‌గా రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రివైజ్డ్ పెన్షన్ ఆర్డర్ కాపీలను ఇవ్వాలి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో పనిచేసే దిగిపోయిన కార్మికులకు రివైజ్డ్ పెన్షన్ పెంచి పిపిఓ కాపీలను వెంటనే కార్మికులకు ఇవ్వాలి అని భూపాలపల్లి సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గుండేటి సమ్మయ్య, కార్యదర్శి కొండపాక సాంబయ్య గిట్ల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో 11వ వేస్ బోర్డ్ లో దిగిపోయిన విశ్రాంత ఉద్యోగు లు రివైజ్డ్ పెన్షన్ కొరకు అప్లికేషన్ పెట్టుకోవాలని వివిధ డిపార్ట్మెంట్లలో మైన్స్ మీద కంపెనీ బోర్డులు పెట్టుటవలన ఈ ప్రకటన చూసి విశ్రాంత కార్మికులు వారిది వారి జీవిత భాగస్వామి ఆధార్ కార్డులు పెన్షన్ తీసుకునే బ్యాంక్ (ఫార్మర్ సర్వేవల్ మోడ్) జిరాక్స్ కాపీలు భార్య భర్తలు కలిసి దిగిన ఫోటోలు, పెన్షన్ ఆర్డర్ కాపీలు జిరాక్స్ కాపీలను సుదీర్ ప్రాంతంలో నివసిస్తున్న విశ్రాంత కార్మికులు వచ్చి వారు పనిచేసి దిగిపోయిన గని సంక్షేమ అధికారుల కార్యాలయాలలో ఇవ్వడం జరిగింది. గత ఆరు నెలల నుండి సవరించిన పెన్షన్ కొరకు విశ్రాంతి కార్మికులు ఎదురుచూస్తున్నారని వారు పేర్కొన్నారు. కొన్ని గనుల నుంచి సీఎం పిఎఫ్ కార్యాలయానికి చేరిన దరఖాస్తులను పరిశీలించి కొంత మందికి మాత్రమే సవరించిన పిపిఓ ఆర్డర్లు వచ్చినాయి ఇంకా చాలామందికి పిపిఓ ఆర్డర్ కాపీలు రాలేదని వారు పేర్కొన్నారు.

## కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కార్యకర్తలను కడపులో పెట్టి చూసుకుంటామని కార్యకర్తల గౌరవాన్ని కాపాడుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీలోని మొగుళ్ల వెంకట్రామ్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మేడ్చల్‌మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల విసృత స్థాయి సమావేశాన్ని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూ వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కార్యకర్తలు మంచి జోష్‌లో ఉన్నారని మనోనిబ్బరంతో ఓటు వేసి సునితమహేందర్‌రెడ్డిని ఎంపిగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సిట్టింగ్ ఎంపి స్థానం మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదని ప్రతిపక్ష హోదాలో ఉండి ఆయనను ఎలాగైతే బంపర్ మెజార్టీతో గెలిపించామో వికారాబాద్ జడ్పి చైర్మన్, మల్కాజ్‌గిరి పార్లమెంటరీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని అలాగే బ్రహ్మండమై న మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఎంపి అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ మేడ్చల్ నియోజకవర్గ ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయని తాను ఉమ్మడి రంగారెడ్డి జడ్‌పి చైర్ పర్సన్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి అనేక నిధులు మంజూరు చేశానని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్‌లో ఎన్నో అవమానాలు, చీత్కారాలు, కేసులు, దాడులు భరించామని ఇక ఓపిక లేక కాంగ్రెస్‌లోకి ఇటీవలనే వచ్చామని చెప్పారు. తనను ఆదరించి లక్ష మెజార్టీతో ఎంపిగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటామని ఏనాడు మరిచిపోమని మీ అందరికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మల్కాజ్‌గిరి మాజి ఎంఎల్ఎ మైనంపల్లి హన్మంతరావు, ఎంఎల్‌సి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజి ఎంఎల్ఎ సుదీర్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భారత స్వాతంత్రోద్యమ యోధుడు భగత్‌సింగ్ స్పూర్తితో విద్యార్థి ఉద్యమ నిర్మాణం జరగాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి మాజీ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ పేర్కొన్నారు. స్వాతంత్ర ఆకాంక్షను నిలువెల్ల నిలుపుకున్న భగత్‌సింగ్ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోభగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన సభలో శివరామకృష్ణ మాట్లాడుతూ నాడు భగత్‌సింగ్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యాలు అవుతున్నాయని కులం, మతం, స్వార్థ రాజకీయాలకు ఊతగా నిలుస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పసి మెదళ్లలో మతోన్మాదాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తుందని విద్యను కాషాయికరణ చేయడం ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తుందని ఆరోపించారు. విద్యార్థులు సమాజం గురించి ఆలోచించి చైతన్యవంతులైతే తమ ఆటలు సాగవన్న పాలకులు రాజకీయ, సామాజిక చైతన్యానికి అడ్డుపడుతున్నారని శివరామకృష్ణ ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులలో మతోన్మాద శక్తులను అడ్డుకోవాలంటే విద్యార్థులను చైతన్యపర్చాలని సమాజ మార్పు కోసం విద్యార్థి ఉద్యమాలు అవసరమన్నారు. కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రోహిత్, ప్రతాప్, రాజు, సునీల్, రాకేష్, నవ్య, ప్రశాంతి, శిల్ప, పావని పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యం

విద్యా వ్యవస్థ బాగు కొరకు నూతన ప్రభుత్వం దృష్టి సారించాలి

శాసనమండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పది సంవత్సరాల కాలంలో పాఠశాల విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురికాబడిందని, పాఠశాల విద్యలో ప్రమాణాలు తగ్గిపోయాయని నూతన ప్రభుత్వం విద్యాశాఖపై దృష్టి కేంద్రీకరించి, మెరుగైన విద్య కొరకు విద్యాశాఖను పునః సమీక్షించాలని శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, సంఘం వ్యవస్థాపకులు అమరజీవి అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఉపాధ్యాయ ఉద్యమం నేటి సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో నర్సిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ అమరజీవి అప్పారి వెంకటస్వామి లాంటి నాయకులు నిస్వార్థమైన సేవలు అందించడం వలనే నేడు ఉపాధ్యాయులు మెరుగైన వసతులు అనుభవిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధాన పత్రం విద్యను కాషాయీకరించే విధంగా ఉం దని తెలిపారు. కవి ఎగ్బాల్, రోమిల్లా థాపర్‌ల రచనలను ,భగత్ సింగ్ లాంటి వీరుల చరిత్రను పాఠ్య పుస్తకాల నుండి తొలగిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఎన్రోల్మెంట్ పరిస్థితిపై వర్క్ షాప్ నిర్వహించారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తీసుకోవాల్సిన కర్తవ్యాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్ రెడ్డి , జి నాగమణి, రాష్ట్ర మైనారిటీ గురుకులాల అధ్యక్షులు జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి వెంకటేశం, ఉపాధ్యక్షులు శ్రీనివాస చారి, అరుణ, కోశాధికారి శేఖర్ రెడ్డి, సిహెచ్ అరుణ, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, శ్రీనివాస్ రెడ్డి, జి.నర్సింహ, రాజు, విజయలక్ష్మి, మధుసూదన్ రెడ్డి, రమాదేవి, వెంకన్న, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఏడుపాయలలో కిక్కిరిసిన భక్తులు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా మాత సన్నిధి భక్తులతో నిండిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వనదుర్గమ్మ దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు ముందుగా చెక్ డ్యాం, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి, వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్లు, మేళ తాళాలతో బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. మమ్మేలు మాయమ్మ, ఏడుపాయల వనదుర్గమ్మ తల్లీ.. అంటూ భక్తులు వేడుకున్నారు. ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీ శర్మ, పార్థీవ శర్మలు పూజలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ పాలకమండలి ఛైర్మన్ బాలగౌడ్, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లోని షెడ్లు, పచ్చని చెట్ల కింద భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుపయనమయ్యారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై నరేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## నల్లగొండ ఎంపి టికెట్ కేటాయింపులో బిసిలకు మోసం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ పార్లమెంట్ టికెట్ కేటాయింపులో మూడు పార్టీలు బీసీలను మోసం చేశాయని బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర కార్య దర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని పార్టీలు 60 శాతం ఉన్న బీసీలను పక్కన పెట్టి కేవలం కావాలనే ఒకే సామాజిక వర్గానికి కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అగ్రకులాల వారిని నియమించి సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కి బిసిలను అవమానించారని అన్నారు. అది కాంగ్రెస్ పార్టీ కాదు కుటుం బ వలసలపార్టీ అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే వాడుకుంటున్నాయన్నారు. బీసీలకు టికెట్ల కేటా యింపులో అన్యాయం చేసే పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామన్నారు.

## సుప్రీంకు కర్నాటక సిఎం

(మొదటి పేజీ తరువాయి)

కరువు ప్రాంతంగా ప్రకటించినట్లు చెప్పారు. గత 30–40 ఏళ్లలో అత్యంత తీవ్రమైన పరిస్థితి ఉందని.. 48 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లుగా చెప్పారు. నిధులు విడుదల చేయాలని కేంద్రానికి మూడుసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా రాలేదన్నారు. పిటిషన్‌లో ఖరీఫ్ 2023 సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు కలిపి రూ.35,162 కోట్ల మేర నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ కింద కేంద్రం నుంచి రూ.18,171.44కోట్లు సహాయం చేయాలని కోరినట్లు తెలిపారు. నివేదిక వచ్చినా కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ చట్టం 2005 ప్రకారం కేంద్రం నుంచి సహాయం పొందే అర్హత రాష్ట్రానికి ఉందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం.. ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (ఐఎంసిటి) నివేదిక అందిన నెలలోగా ఎన్‌డిఆర్ఎఫ్ నుంచి రాష్ట్రానికి సహాయం అందించే విషయంలో కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాలని పిటిషన్ పేర్కొంది. గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వ బృందం రాష్ట్రానికి వచ్చి పరిశీలించిందని సిద్ధరామయ్య తెలిపారు. కరువుపై కేంద్రానికి మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లామని.. కానీ కేంద్రమంత్రులు ఎవరూ కలువలేదన్నారు. ఆ తర్వాత మళ్లీ కేంద్ర హోంశాఖ మంత్రిని కలిసినా ఇంకా నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com